RNI : APTEL/25/A0108

www.themahinews.com

# మహి న్యూస్

MAHI NEWS

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898


ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక : 202, ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజీలు : 8, వెల రూ. 5, /- శనివారం -01 - నవంబర్ - 2025

published From : YSR Kadapa. circulated by Kurnool I Anantapuram I Chitoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad and Telangana

## తుపాను నష్టంపై ప్రధాని మోదీతో
# వ్యక్తిగతంగా మాట్లాడతా

### మొంథా తుపాను నష్టంపై సీఎం చంద్రబాబు సమీక్ష

- ★ తుపాను నష్టంపై కేంద్రానికి తక్షణ నివేదికకు ఆదేశం
- ★ శాటిలైట్ చిత్రాలతో నీటమునిగిన పొలాల గుర్తింపు
- ★ యుద్ధప్రాతిపదికన పొలాల నుంచి నీటిని మళ్లించాలని సూచన
- ★ తుపాను విధుల్లో ఉత్తమ సేవలు అందించిన 100 మందికి సన్మానం



అమరావతి: మొంథా తుపాను కారణంగా రాష్ట్రంలో జరిగిన ఆస్తి, పంట నష్టాన్ని అంచనా వేసి, కేంద్ర ప్రభుత్వానికి తక్షణమే ప్రాథమిక నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలనకు కేంద్ర బృందాన్ని ఆహ్వానించాలని, తుది నివేదిక అందేలోపు తక్షణ సాయం కోరాలని సూచించారు. ఈ విషయమై తాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో వ్యక్తిగతంగా మాట్లాడతానని ఆయన తెలిపారు. తుఫాన్ అనంతర సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి టెలీ కాన్ఫరెన్స్ మిగతా..2లో

## శత్రువుల ఇంట్లోకి
# చొరబడి మరీ కొడతాం..

- ● ప్రధాని మోదీ హెచ్చరిక
- ● సర్దార్ పటేల్ 150వ జయంతి వేడుకల్లో ప్రధాని మోదీ ప్రసంగం
- ● 'ఆపరేషన్ సిందూర్'తో భారత్ శక్తి ఏంటో ప్రపంచానికి తెలిసిందన్న మోదీ
- ● గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుల కోసం దేశ భద్రతను విస్మరించాయని విమర్శ
- ● దేశంలో నక్సలిజాన్ని చాలా వరకు నియంత్రించామని వెల్లడి
- ● చట్టవిరుద్ధ చొరబాటుదారులందరినీ ఏరివేస్తామని ప్రతిజ్ఞ



ఢిల్లీ: శత్రువులకు భారత్ ఇచ్చే సమాధానం ఇప్పుడు చాలా స్పష్టంగా, బలంగా, ప్రపంచానికి కనిపించేలా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గుజరాత్‌లోని 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా శత్రు భూభాగంలోకి ప్రవేశించి మరీ దాడులు చేయగలమని భారత్ నిరూపించిందని ఆయన స్పష్టం చేశారు. "ఎవరైనా భారత్ వైపు మిగతా..2లో

## ప్రధాని మోదీ తన స్థాయిని మరిచి
# మాట్లాడుతున్నారు

### తమిళనాడులో బీహారీ కార్మికులను డీఎంకే వేధిస్తోందన్న మోదీ

- ➤ ప్రధాని వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన సీఎం స్టాలిన్
- ➤ రాష్ట్రాల మధ్య విరోధం సృష్టించే చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు



తమిళనాడు: తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం బీహార్ వలస కార్మికులను వేధిస్తోందంటూ ప్రధాని మోదీ చేసిన ఆరోపణలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రధాని తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ ఘాటుగా బదులిచ్చారు. బీహార్‌లో జరిగిన ఓ ఎన్నికల మిగతా..2లో




## ఫలించిన చర్చలు..
## ఏపీలో ఎన్టీఆర్ వైద్య సేవలు మళ్లీ ప్రారంభం

- ● ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇటీవల నిలిచిపోయిన ఎన్టీఆర్ వైద్య సేవలు
- ● కొనసాగించేందుకు అంగీకరించిన యాజమాన్యాలు
- ● ప్రభుత్వంతో జరిగిన చర్చలు విజయవంతం
- ● బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన సర్కార్

## ప్రాణ రక్షణకే దేశం విడిచా..
## మౌనం వీడిన షేక్ హసీనా




బంగ్లాదేశ్ ను ఎందుకు వీడాల్సి వచ్చిందో వెల్లడించిన షేక్ హసీనా

## కిషన్ రెడ్డి 'దేశద్రోహి' వ్యాఖ్యలు..
### తీవ్రంగా స్పందించిన అజారుద్దీన్




కిషన్ రెడ్డి తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్న అజారుద్దీన్

తనకు ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదని వ్యాఖ్య

కిషన్ రెడ్డికి అవగాహన లేకుండా తనపై విమర్శలు చేస్తున్నారన్న అజారుద్దీన్

హైదరాబాద్: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, కాంగ్రెస్ సీనియర్ నేత మహమ్మద్ అజారుద్దీన్ తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాలులో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించారు. అల్లా పేరు మీద అజారుద్దీన్ ప్రమాణం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో మిగతా..2లో




## ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటాం

### సర్వం కోల్పోయిన బాధితులను సీఎం పరామర్శ

హుస్నాబాద్: మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించారు. హెలికాప్టర్ నుంచి హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలను ఆయన వీక్షించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఏరియల్ సర్వేకు వెళ్లారు. అనంతరం హనుమకొండలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం.. సమ్మయ్యనగర్‌లో వరద ప్రాంతాలను, దెబ్బతిన్న నాలాలను పరిశీలించారు. మొంథా తుపాను కారణంగా భారీ వర్షాలు, వరదలతో ఉమ్మడి వరంగల్ జిల్లా అతలాకుతలమైన విషయం తెలిసిందే. లక్షలాది ఎకరాల పొలాలు నీటమునిగాయి. వేలాది ఇళ్లలోకి వరద నీరు చేసింది. సర్వం కోల్పోయిన బాధితులను సీఎం పరామర్శించారు. బాధితులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు సీఎంకు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు ఉన్నారు.

## వీధి కుక్కల కేసు: రాష్ట్రాల సీఎస్‌లపై సుప్రీంకోర్టు ఆగ్రహం.. భౌతికంగా హాజరుకావాల్సిందేనని ఆదేశం

### నవంబర్ 3న భౌతికంగా హాజరు కావాలని కఠిన ఆదేశాలు




- ● వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలన్న విజ్ఞప్తి తిరస్కరణ
- ● కోర్టు ఆదేశాలను అధికారులు పట్టించుకోవడం లేదన్న ధర్మాసనం

38 YEARS OF DELIVERING EXCELLENCE

THE PROFESSIONAL COURIERS

DOMESTIC & INTERNATIONAL - COURIER & CARGO & PREMIUM SERVICES

Hearty Welcome



Shri. Thomas John

Honourable Chairman

Your Gracious Presence Today

Make This Gathering Even More Special.

RAYALASEEMA AREA

CLUSTER MEETING @ KURNOOL

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com


## అమెరికా-భారత్ మధ్య కీలక రక్షణ ఒప్పందం

ఢిల్లీ: అమెరికా, భారత దేశాల మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరింది. మలేషియాలో ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌లు సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక, భద్రత సహకారాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించిన ఈ ఒప్పందం పదేళ్ల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా హెగ్సెత్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా స్పందిస్తూ, పదేళ్ల రక్షణ ఒప్పందంపై సంతకం చేయడానికి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశం కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఇది ఇరు దేశాల రక్షణ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకువెళుతుందని ఆయన అన్నారు. సమన్వయం, సమాచారంతో పాటు సహకారాన్ని మరింతగా పెంచుకుంటామని, తమ రక్షణ సంబంధాలు మరింత బలంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

## ప్రాణ రక్షణకే దేశం విడిచా.. మౌనం వీడిన షేక్ హసీనా

బంగ్లాదేశ్ : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా తన ప్రవాసంపై తొలిసారిగా మౌనం వీడారు. తన ప్రాణాలను, తన చుట్టూ ఉన్నవారి భద్రతను కాపాడేందుకే దేశం విడిచి పెట్టాల్సి వచ్చిందని, అదొక 'తప్పనిసరి అవసరం'గా మారిందని ఆమె స్పష్టం చేశారు. తన పాలనను కూల్చివేసిన విద్యార్థుల నిరసనలను 'హింసాత్మక తిరుగుబాటు'గా అభివర్ణించిన ఆమె, భద్రతా బలగాలు కాల్పులు జరపాలని తాను ఆదేశించానన్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. బ్రిటిష్ మీడియా సంస్థ 'ది ఇండిపెండెంట్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హసీనా పలు కీలక విషయాలు వెల్లడించారు. "నేను అక్కడ ఉండి ఉంటే నా ప్రాణాలకే కాదు, నా చుట్టూ ఉన్నవారికి కూడా ప్రమాదం వాటిల్లేది" అని ఆమె పేర్కొన్నారు. గత ఏడాది ఆగస్టు 5న ఆమె దేశం విడిచి భారత్ కు వచ్చేసిన విషయం తెలిసిందే. బంగ్లాదేశ్‌లో తన అవామీ లీగ్ పార్టీపై నిషేధం ఉన్నప్పటికీ, దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమే తన లక్ష్యమని ఆమె పునరుద్ఘాటించారు.

అది హింసాత్మక తిరుగుబాటు

స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు ఉద్యోగాల్లో కోటాను రద్దు చేయాలనే డిమాండ్‌తో మొదలైన విద్యార్థుల నిరసనలు, చివరికి తన ప్రభుత్వాన్ని కూల్చివేసే స్థాయికి చేరాయని హసీనా అన్నారు. ఈ నిరసనలను 'హింసాత్మక తిరుగుబాటు'గా పేర్కొన్న ఆమె, "నాయకురాలిగా నేను బాధ్యత తీసుకుంటాను. కానీ, భద్రతా బలగాలను కాల్పులు జరపమని ఆదేశించాననడం పూర్తిగా అబద్ధం" అని తేల్చిచెప్పారు. ఘర్షణల్లో మరణాలు సంభవించడానికి క్షేత్రస్థాయిలో భద్రతా దళాల్లో క్రమశిక్షణ లోపించడమే కారణమని ఆరోపించారు. మృతుల సంఖ్యను 1,400గా ప్రచారం చేయడాన్ని ఆమె తోసిపుచ్చారు. అది కేవలం తనపై జరుగుతున్న ప్రచారంలో భాగమేనని, ఆ సంఖ్యను భారీగా పెంచి చెబుతున్నారని అన్నారు.

నాపై బూటకపు విచారణ

ప్రస్తుతం బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ తనపై జరుపుతున్న విచారణను హసీనా 'బూటకపు విచారణ'గా కొట్టిపారేశారు. "నన్ను రాజకీయంగా అంతం చేయడానికే, ఎన్నిక కాని ప్రభుత్వం నా రాజకీయ ప్రత్యర్థులతో ఈ బూటకపు కోర్టును నడుపుతోంది" అని ఆమె ఆరోపించారు. ఈ విచారణలో తనకు మరణశిక్ష విధించినా ఆశ్చర్యపోనని, భయపడబోనని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన ప్రాసిక్యూటర్ తాజుల్ ఇస్లాం మాత్రం విద్యార్థుల నిరసనల సమయంలో జరిగిన హింసకు, మానవ హక్కుల ఉల్లంఘనకు షేక్ హసీనానే 'ప్రధాన సూత్రధారి' అని ఆరోపిస్తున్నారు. ఈ ఇంటర్వ్యూలో హసీనా తన రాజకీయ పునరాగమనంపై గానీ, బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చే ప్రణాళికలపై గానీ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

## విద్యార్థిని శ్రీ వర్షిత కుటుంబాన్ని పరామర్శించిన కవిత

హైదరాబాద్: గురుకుల పాఠశాల విద్యార్థిని శ్రీ వర్షిత మృతి ఘటనపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనపై తక్షణమే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హుజురాబాద్ మండలం రాంపూర్‌లోని శ్రీ వర్షిత కుటుంబాన్ని పరామర్శించిన కవిత, ఆమె తల్లిదండ్రులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై, స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. "ప్రతిపక్ష నేతలపై, ప్రత్యర్థులపై సిట్‌లు వేసే ఈ ప్రభుత్వం, ఒక విద్యార్థిని మృతి లాంటి తీవ్రమైన విషయంలో ఎందుకు మౌనంగా ఉంది? ఈ ఘటన జరిగి వారం రోజులు దాటినా విచారణలో ఎలాంటి పురోగతి లేదు. మంత్రి పొన్నం ప్రభాకర్ విచారణ జరిపిస్తామని చెప్పి చేతులు దులుపుకున్నారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం" అని కవిత మండిపడ్డారు. గడిచిన ఏడాదిన్నర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో 110 మంది విద్యార్థులు వివిధ కారణాలతో మరణించారని, ఆ తల్లిదండ్రుల ఉసురు ప్రభుత్వానికి తప్పక తగులుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చదువులో చురుగ్గా, ధైర్యంగా ఉండే శ్రీ వర్షిత ఆత్మహత్య చేసుకుందంటే ఎన్నో అనుమానాలు తలెత్తుతున్నాయని కవిత అన్నారు. "ఆత్మహత్యకు కేవలం గంట ముందు తల్లిదండ్రులతో ఆనందంగా మాట్లాడిన అమ్మాయి అకస్మాత్తుగా ఎలా చనిపోతుంది? ఈ అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే" అని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి, మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ఘటనపై బాధ్యత తీసుకుని, నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శ్రీ వర్షిత కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు తెలంగాణ జాగృతి అండగా ఉంటుందని కవిత హామీ ఇచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోతే ఊరుకునేది లేదని ఆమె హెచ్చరించారు. తక్షణమే ఈ కేసుపై సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించాలని ఆమె పునరుద్ఘాటించారు.

## వీధి కుక్కల కేసు: రాష్ట్రాల సీఎస్‌లపై సుప్రీంకోర్టు ఆగ్రహం..

### భౌతికంగా హాజరుకావాల్సిందేనని ఆదేశం

ఢిల్లీ: వీధి కుక్కల నియంత్రణ కేసులో పలు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల (సీఎస్‌లు) తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను పాటించని సీఎస్‌లు నవంబర్ 3న జరిగే విచారణకు భౌతికంగా హాజరు కావాల్సిందేనని స్పష్టం చేసింది. వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ కేసుకు సంబంధించి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా శుక్రవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. సదరు సీఎస్‌లను వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలని కోరారు. దీనిపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "కంప్లయన్స్ అఫిడవిట్ దాఖలు చేయమని మేము ఆదేశిస్తే, వాళు నిద్రపోతున్నారు. కోర్టు ఆదేశాల పట్ల ఏమాత్రం గౌరవం లేదు. సరే, అయితే వాళ్లనే రానివ్వండి" అని జస్టిస్ విక్రమ్ నాథ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. వీధి కుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల మేరకు కంప్లయన్స్ అఫిడవిట్లు దాఖలు చేయనందున, పశ్చిమ బెంగాల్, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాల సీఎస్‌లు నవంబర్ 3న తమ ముందు హాజరు కావాలని సుప్రీంకోర్టు అక్టోబర్ 27న ఆదేశించిన విషయం తెలిసిందే. ఆగస్టు 22న సుప్రీంకోర్టు ఈ కేసు పరిధిని ఢిల్లీ-ఎన్‌సీఆర్ నుంచి దేశవ్యాప్తంగా విస్తరించింది. జంతు జనన నియంత్రణ (ఏబీసీ) నిబంధనల అమలుకు అవసరమైన వనరుల (డాగ్ పౌండ్స్, పశువైద్యులు, కుక్కలను పట్టే సిబ్బంది, వాహనాలు, బోనులు) పూర్తి గణాంకాలతో అఫిడవిట్లు దాఖలు చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మున్సిపల్ అధికారులను ఆదేశించింది. ఏబీసీ నిబంధనలు దేశమంతటా ఒకేలా వర్తిస్తాయని పేర్కొంటూ రాష్ట్రాలను ఈ కేసులో ప్రతివాదులుగా చేర్చింది. ఢిల్లీలో వీధి కుక్కల కాటు వల్ల చిన్నారులు రేబిస్ బారిన పడుతున్నారంటూ వచ్చిన మీడియా కథనాల ఆధారంగా సుప్రీంకోర్టు జూలై 28న ఈ కేసును సుమోటోగా స్వీకరించి విచారణ జరుపుతోంది.

## ఫలించిన చర్చలు.. ఏపీలో ఎన్టీఆర్ వైద్య సేవలు మళ్లీ ప్రారంభం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రోగులకు ఊరటనిచ్చే వార్త. కొద్దిరోజులుగా ప్రైవేటు నెట్ వర్క్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో నిలిచిపోయిన ఎన్టీఆర్ వైద్య సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. పెండింగ్ బకాయిల విడుదల విషయమై ప్రభుత్వానికి, ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు మధ్య నెలకొన్న వివాదం పరిష్కారమైంది. ప్రభుత్వంతో జరిగిన చర్చలు సఫలం కావడంతో సేవలను కొనసాగించేందుకు యాజమాన్యాలు అంగీకరించాయి. గత కొంతకాలంగా తమకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రైవేటు నెట్ వర్క్ స్పెషాలిటీ ఆసుపత్రులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో ఎన్టీఆర్ వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పేద, మధ్యతరగతి రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సకాలంలో వైద్యం అందక అనేకమంది అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ప్రభుత్వం, ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చలు జరిపింది. యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను, డిమాండ్లను సానుకూలంగా పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. ప్రభుత్వ హామీతో సంతృప్తి చెందిన ప్రైవేటు ఆసుపత్రులు, ఎన్టీఆర్ వైద్య సేవలను పునరుద్ధరించడానికి అంగీకరించాయి. దీంతో రోగులు యథావిధిగా ఈ సేవలను వినియోగించుకునేందుకు మార్గం సుగమమైంది.

## ఆరెస్సెస్ పై నిషేధం.. స్పందించిన మల్లికార్జున ఖర్గే

ఢిల్లీ: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్)ను నిషేధించాలన్నది తన వ్యక్తిగత అభిప్రాయమని, దేశ తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ కూడా ప్రభుత్వ ఉద్యోగులు ఆరెస్సెస్ కార్యకలాపాల్లో పాల్గొనకుండా నిషేధించారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పునరుద్ఘాటించారు. దేశంలో ఎక్కువగా శాంతిభద్రతల సమస్య తలెత్తడానికి ఆరెస్సెస్, బీజేపీ కారణమని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో నిషేధించాలనేది తన అభిప్రాయమన్నారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ దేశానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. జాతి ఐక్యతకు వారు ఎంతో చేశారని అన్నారు. ఆరెస్సెస్ నిషేధం అంశంపై కూడా ఆయన స్పందించారు. దాని భావజాలం విషంతో సమానమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహాత్మాగాంధీ హత్యకు దారితీసిన వాతావరణాన్ని ఆరెస్సెస్ సృష్టించిందని మండిపడ్డారు. ఇదే విషయాన్ని పేర్కొంటూ సర్దార్ వల్లభాయ్ పటేల్... శ్యాంప్రసాద్ ముఖర్జీకి లేఖ రాశారని తెలిపారు. పటేల్, నెహ్రూ మధ్య సత్సంబంధాలు ఉన్నప్పటికీ వారి మధ్య చీలిక తేవడానికి ప్రయత్నించారని ఆరోపించారు. కశ్మీర్ మొత్తాన్ని భారతదేశంలో కలపాలని పటేల్ అనుకున్నారని, కానీ నెహ్రూ ఆ ప్రయత్నాలను అడ్డుకున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. మోదీ వ్యాఖ్యలపై ఖర్గే పైవిధంగా స్పందించారు. ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ కూడా స్పందించింది. దశాబ్దాల పాటు సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలను కాంగ్రెస్ ఎందుకు విస్మరించిందని ప్రశ్నించింది.

## ప్రధాని మోదీ తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారు

మొదటి పేజి తరువాయి

బీహార్‌లో జరిగిన ఓ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులో పనిచేస్తున్న బీహారీ కార్మికులను డీఎంకే ప్రభుత్వం అవమానిస్తోందని, వారిపై వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో, ప్రధాని వ్యాఖ్యలను ఖండిస్తూ సీఎం స్టాలిన్ 'ఎక్స్' వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు. "ఒక తమిళుడిగా ప్రధాని మోదీని నేను వినయంగా కోరుతున్నాను. ఆయన దేశ ప్రజలందరికీ ప్రధాని అనే గౌరవప్రదమైన స్థానంలో ఉన్నారనే విషయాన్ని తరచుగా మర్చిపోతున్నారేమో అని బాధగా ఉంది. ఇలాంటి ప్రకటనలతో తన పదవికి ఉన్న గౌరవాన్ని కోల్పోవద్దు" అని స్టాలిన్ పేర్కొన్నారు. బీజేపీ సభ్యులు కేవలం ఎన్నికల రాజకీయాల కోసం ఒడిశా, బీహార్ అంటూ తమిళులపై తమ ద్వేషాన్ని ప్రదర్శిస్తున్నారని, ఒక ముఖ్యమంత్రిగా ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. హిందువులు, ముస్లింల మధ్య శత్రుత్వం పెంచినట్లే, ఇప్పుడు తమిళులు, బీహార్ ప్రజల మధ్య విరోధం సృష్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని స్టాలిన్ విమర్శించారు. "ఇటువంటి చిల్లర రాజకీయ పద్ధతులు మానుకుని, దయచేసి దేశ సంక్షేమంపై దృష్టి పెట్టండి" అని ప్రధానికి, బీజేపీ నేతలకు ఆయన హితవు పలికారు. ప్రధాని వ్యాఖ్యలతో దక్షిణాది రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

## ఐక్యతా దినోత్సవం.. దేశ సమగ్రతే లక్ష్యం.. ఐక్యతా ప్రతిజ్ఞ చేసిన ప్రధాని మోదీ

ఢిల్లీ: సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని (రాష్ట్రీయ ఏక్తా దివస్) ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో నర్మదా నది ఒడ్డున ఉన్న 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' వద్ద సర్దార్ పటేల్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన భారీ పరేడ్, సాంస్కృతిక ప్రదర్శనలు దేశ భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'ఏక్తా శపథ్' (ఐక్యతా ప్రతిజ్ఞ) చేశారు. "దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటానికి నా జీవితాన్ని అంకితం చేస్తానని ఈ రోజు ప్రతిజ్ఞ చేస్తున్నాను. జాతీయ ఐక్యతా స్ఫూర్తితో ఈ ప్రమాణం స్వీకరిస్తున్నాను. దేశ అంతర్గత భద్రతను కాపాడేందుకు కట్టుబడి ఉంటాను" అని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు ఈరోజు ఉదయం 8 గంటల ప్రాంతంలో ప్రధాని మోదీ పటేల్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అక్కడ నిర్వహించిన 'రాష్ట్రీయ ఏక్తా దివస్ పరేడ్'ను వీక్షించారు. ఈ పరేడ్‌లో బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ సహా వివిధ రాష్ట్రాల పోలీస్ బలగాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ప్రధాని 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పటేల్‌కు నివాళులర్పించారు. "సర్దార్ పటేల్ 150వ జయంతి సందర్భంగా భారత్ ఆయనకు నివాళులర్పిస్తోంది. దేశాన్ని ఏకీకరణ చేయడంలో ఆయన కీలక శక్తిగా నిలిచారు. జాతీయ సమగ్రత, సుపరిపాలన, ప్రజాసేవ పట్ల ఆయనకున్న నిబద్ధత ఎన్నో తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది" అని మోదీ పేర్కొన్నారు. అనంతరం విడుదల చేసిన వీడియో సందేశంలో భారతదేశ ఏకీకరణ శిల్పిగా పటేల్‌ను అభివర్ణించారు. "భావజాల విభేదాలు ఉన్నవారితో కూడా కలిసి పనిచేసి, ప్రజలను ఏకం చేయడంలో సర్దార్ పటేల్‌కు సాటిలేని సామర్థ్యం ఉంది. ఆయన ప్రతి చిన్న విషయాన్ని గమనించి, దేశ ఐక్యత కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను భాగస్వాములను చేసి, సంస్థానాలను దేశంలో విలీనం చేసి, భిన్నత్వంలో ఏకత్వం అనే మంత్రాన్ని భారతీయులలో మేల్కొల్పారు" అని ప్రధాని వివరించారు. భారతదేశ ఐక్యత, సమగ్రత, భద్రతను పెంపొందించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న సర్దార్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే.

## అమరావతి పనుల్లో జాప్యం వద్దు... గడువులోగా పూర్తి చేయాల్సిందే: సీఎం చంద్రబాబు

అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని, నిర్దేశించుకున్న గడువులోగా పనులు పూర్తి చేయాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. నిర్మాణాల్లో వేగంతో పాటు నాణ్యత విషయంలో కచ్చితమైన ప్రమాణాలు పాటించాలని సూచించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీఎల్, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజధానిలో చేపట్టిన భవన నిర్మాణాల పురోగతి, సుందరీకరణ పనులు, రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై సీఎం చర్చించారు. ఏయే నిర్మాణాలు ఎంతవరకు పూర్తయ్యాయి, ఎంతమంది వర్క్ ఫోర్స్ అందుబాటులో ఉన్నారు, నిర్మాణ సంస్థలు అవసరమైన మెషినరీ, మెటీరియల్‌ను సమకూర్చుకున్నాయా అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల పురోగతిని ప్రతి 15 రోజులకు ఒకసారి తానే స్వయంగా సమీక్షిస్తానని చంద్రబాబు వెల్లడించారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల పనుల్లో కొంత జాప్యం జరిగినా, రానున్న రోజుల్లో దానిని భర్తీ చేసేలా వేగం పెంచాలని సూచించారు. కొన్ని నిర్మాణ సంస్థలు ఇంకా పూర్తిస్థాయిలో వర్క్ ఫోర్స్, మెషినరీని కేటాయించలేదని, అలాంటి సంస్థలు తమ పనితీరును వెంటనే మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. భవన నిర్మాణాలకు అవసరమైన గ్రావెల్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా గనుల శాఖతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఈ విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి నారాయణ, అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఇంకా 2,471 మంది రైతులకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని, కొన్ని సాంకేతిక, రైతుల వ్యక్తిగత కారణాల వల్ల ఇవి పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. త్వరలోనే తాను రాజధాని రైతులతో సమావేశమవుతానని చంద్రబాబు తెలిపారు. నిర్మాణాలతో పాటు రాజధానిలో పచ్చదనం, సుందరీకరణ, పరిశుభ్రతకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. అమరావతికి 'వరల్డ్ క్లాస్ సిటీ' లుక్ రావాలంటే ఆకాశహర్మ్యాలు (హైరైజ్ బిల్డింగులు) అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రైవేట్ సంస్థలు చేపట్టే నిర్మాణాలు కూడా ఐకానిక్ మోడల్‌లో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వివిధ కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

## శత్రువుల ఇంట్లోకి చొరబడి మరీ కొడతాం..

మొదటి పేజి తరువాయి

"ఎవరైనా భారత్ వైపు కన్నెత్తి చూసే సాహసం చేస్తే, భారత్ వారి ఇంట్లోకి చొరబడి మరీ దెబ్బకొడుతుందని 'ఆపరేషన్ సిందూర్'తో ప్రపంచమంతా చూసింది. ఈ రోజు పాకిస్థాన్‌కు, ఉగ్రవాద నిర్వాహకులకు భారత్ అసలైన శక్తి ఏంటో బాగా తెలుసు" అని ప్రధాని అన్నారు. దేశ భద్రత విషయంలో తమ ప్రభుత్వ దృఢ వైఖరి, సర్దార్ పటేల్ ఆశయాలకు అనుగుణంగానే ఉందని ఆయన పేర్కొన్నారు. జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా ప్రధాని కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ పటేల్ ఆశయాలను పూర్తిగా మరిచిపోయిందని ఆరోపించారు. కేవలం బాహ్య శత్రువులకే కాకుండా నక్సలిజం, చొరబాట్లు వంటి అంతర్గత సవాళ్లను ఎదుర్కోవడంలో కూడా తమ ప్రభుత్వానికి పటేల్ ఆదర్శాలే మార్గనిర్దేశం చేస్తున్నాయని తెలిపారు. "2014కు ముందు దేశంలోని అనేక ప్రాంతాల్లో నక్సలైట్లు సమాంతర పాలన సాగించారు. పాఠశాలలు, ఆసుపత్రులను పేల్చివేస్తుంటే, నాటి ప్రభుత్వాలు నిస్సహాయంగా చూశాయి. మేము అర్బన్ నక్సల్స్‌పై కఠినంగా వ్యవహరించాం. దాని ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. గతంలో 125 జిల్లాల్లో ఉన్న నక్సల్స్ ప్రభావం ఇప్పుడు కేవలం 11 జిల్లాలకే పరిమితమైంది" అని మోదీ వివరించారు. చొరబాట్లు దేశ ఐక్యతకు పెను ముప్పుగా పరిణమించాయని ప్రధాని హెచ్చరించారు. "గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుల కోసం దేశ భద్రతను పణంగా పెట్టాయి. దేశం బలహీనపడినా చొరబాటుదారుల కోసం పోరాడేవారు పట్టించుకోరు. కానీ దేశ భద్రత, గుర్తింపు ప్రమాదంలో పడితే ప్రతి పౌరుడూ ప్రమాదంలో పడినట్లే. అందుకే, చట్టవిరుద్ధంగా నివసిస్తున్న ప్రతి చొరబాటుదారుడిని దేశం నుంచి తొలగించాలని మనం సంకల్పించుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు. భిన్నత్వంలో ఏకత్వం అనే పటేల్ సందేశాన్ని గుర్తుచేస్తూ ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు. "ఐక్య భారతదేశంలో విభిన్న ఆలోచనలను గౌరవించాలి. అభిప్రాయ భేదాలు ఉండొచ్చు, కానీ హృదయాల్లో భేదాలు ఉండకూడదు" అని ఆయన అన్నారు. అంతకుముందు, ప్రధాని మోదీ 182 మీటర్ల ఎత్తైన పటేల్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, హాజరైన వారితో ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. 2014 నుంచి ప్రతి ఏటా అక్టోబర్ 31న సర్దార్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే.

## పార్టీలో అంతర్గత కుమ్ములాటలు..

అమరావతి: ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహించనున్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరుగనున్న ఈ సమీక్షలో తాజా రాజకీయ పరిణామాలతో పాటు, పార్టీలో అంతర్గతంగా తలెత్తుతున్న వివాదాలపై ప్రధానంగా దృష్టి సారించారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొన్ని నియోజకవర్గాల్లో నేతల మధ్య సమన్వయ లోపం, క్రమశిక్షణ ఉల్లంఘనల వంటి అంశాలను చక్కదిద్దడమే లక్ష్యంగా ఈ భేటీ జరుగుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల కొందరు నేతలు క్రమశిక్షణ గీత దాటుతున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో, వారితో ముఖ్యమంత్రి స్వయంగా మాట్లాడనున్నారు. ముఖ్యంగా తిరువూరు నియోజకవర్గంలో రాజుకున్న వివాదంతో పాటు, మరికొన్ని నియోజకవర్గాల్లో నాయకుల మధ్య నెలకొన్న అంతర్గత పోరుపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఈ అంశాలకు వెంటనే పరిష్కారం కనుగొని, పార్టీ పటిష్ఠతకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమీక్షలో పార్టీ కమిటీల ఏర్పాటు, వాటి మధ్య సమన్వయం, అవసరమైన చోట నాయకత్వ మార్పుల వంటి అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. అదే సమయంలో క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా చంద్రబాబు ఆరా తీయనున్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు, కూటమిలోని భాగస్వామ్య పక్షాలతో సమన్వయం ఎలా కొనసాగించాలనే దానిపైనా నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఇవ్వడంపై కూడా ఈ భేటీలో స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. మొత్తం మీద, పాలనతో పాటు పార్టీ వ్యవహారాలను కూడా చక్కదిద్దేందుకు చంద్రబాబు స్వయంగా రంగంలోకి దిగడంతో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

## బీహార్ ఎన్నికలు: కోటి ఉద్యోగాలు, లక్షాధికారులుగా దీదీలు..

### బీహార్‌లో ఎన్డీయే మేనిఫెస్టో హైలైట్స్

బీహార్: బీహార్ అసెంబ్లీ ఎన్నికలు-2025 సమీపిస్తున్న వేళ, అధికార జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీయే) తమ ఎన్నికల మేనిఫెస్టో 'సంకల్ప్ పత్ర'ను తాజాగా విడుదల చేసింది. భారీ ఎత్తున ఉద్యోగాల కల్పన, మహిళా సాధికారత, రైతులు, పేదలకు సంక్షేమ పథకాలను ప్రధాన హామీలుగా ప్రకటించింది. పాట్నాలో జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, కేంద్ర మంత్రులు జితన్ రామ్ మాంఝీ (హెచ్ఏఎం-ఎస్), చిరాగ్ పాశ్వాన్ (ఎల్‌జేపీ-రామ్ విలాస్), ఆర్ఎల్ఎం నేత ఉపేంద్ర కుష్వాహా సహా ఇతర కూటమి నాయకులు హాజరయ్యారు.

ప్రధాన హామీలు ఇవే..

బీహార్‌లో కోటి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్డీయే హామీ ఇచ్చింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఈ ఉద్యోగాలను సృష్టిస్తామని, దీనికి అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపడతామని తెలిపింది. ప్రతి జిల్లాలో ఒక మెగా స్కిల్ సెంటర్ ఏర్పాటు చేసి, రాష్ట్రవ్యాప్తంగా స్కిల్ సెన్సస్ ద్వారా యువత ప్రతిభను గుర్తించి శిక్షణ ఇస్తామని పేర్కొంది. బీహార్‌ను 'గ్లోబల్ స్కిల్లింగ్ హబ్'గా మార్చడమే లక్ష్యమని మేనిఫెస్టోలో వివరించింది. 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' కింద వ్యాపారాలు ప్రారంభించే మహిళలకు రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తామని ఎన్డీయే ప్రకటించింది. కోటి మంది మహిళలను లక్షాధికారులుగా (లక్షాధికారి దీదీ)గా (ఏడాదికి లక్ష రూపాయలకు పైగా సంపాదించే మహిళలు) తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపింది. విజయవంతమైన మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి 'మిషన్ కరోడ్‌పతి'ని కూడా ప్రవేశపెట్టనున్నట్లు హామీ ఇచ్చింది. రైతుల కోసం 'కర్పూరీ ఠాకూర్ కిసాన్ సమ్మాన్ నిధి' పథకాన్ని ప్రకటించింది. దీని కింద ప్రతి రైతుకు పంట సీజన్‌కు రూ.3,000 చొప్పున ఏటా రూ.9,000 అందిస్తామని హామీ ఇచ్చింది. ప్రతి పంచాయతీలో వరి, గోధుమలు, పప్పుధాన్యాలు, మొక్కజొన్న సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని తెలిపింది. అత్యంత వెనుకబడిన వర్గాల (ఈబీసీ) ఆర్థిక, సామాజిక సాధికారత తమ ప్రభుత్వ ప్రాధాన్యమని డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి తెలిపారు. "ఈబీసీ వర్గాలకు చెందిన కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందిస్తాం. వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులను అంచనా వేసి, వారి అభివృద్ధికి అవసరమైన సిఫార్సులు చేసేందుకు సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తాం" అని ఆయన వివరించారు.

మౌలిక సదుపాయాలు, ఇతర హామీలు

పేదల కోసం 'పంచామృత్ గ్యారెంటీ': ఉచిత రేషన్, 125 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం, 50 లక్షల పక్కా ఇళ్ల నిర్మాణం, సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తామని ఎన్డీయే హామీ. కనెక్టివిటీ: ఏడు కొత్త ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణం, 3,600 కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌ల ఆధునికీకరణ, నాలుగు కొత్త నగరాల్లో మెట్రో సేవలు. పారిశ్రామిక పార్కులు: ప్రతి జిల్లాలో ఫ్యాక్టరీలు, 10 కొత్త ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటు. విద్య: పేద కుటుంబాల విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య. బీహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎన్డీయే కూటమిలో బీజేపీ, జేడీయూ, ఎల్‌జేపీ (రామ్ విలాస్), హెచ్ఏఎం(ఎస్), ఆర్ఎల్ఎం పార్టీలు ఉన్నాయి. ఆర్జేడీ నేతృత్వంలోని 'మహాఘట్‌బంధన్' కూటమి ఇప్పటికే తమ మేనిఫెస్టోను విడుదల చేసి, అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

## ఖమ్మం జిల్లాలో సీపీఎం నేత దారుణ హత్య

చింతకాని: ఖమ్మం జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. సీపీఎం నేత, రైతు సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి సామినేని రామారావును దుండగులు హతమార్చారు. చింతకాని మండలం పాతర్లపాడులో ఈ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన ఆయన్ను కత్తులతో పొడిచి చంపేశారు. రామారావు రెండుసార్లు రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శిగా, పాతర్లపాడు సర్పంచ్‌గా పనిచేశారు. ఖమ్మం సీపీ సునీల్ దత్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పోతినేని సుదర్శన్, పొన్నం వెంకటేశ్వరరావుతో పాటు పలువురు నేతలు రామారావు కుటుంబాన్ని పరామర్శించారు. మరోవైపు పాతర్లపాడులో పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాష్ట్రంలో హింసా రాజకీయాలకు తావు లేదు: భట్టి విక్రమార్క

సామినేని రామారావు హత్యపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాష్ట్రంలో హింసా రాజకీయాలకు తావులేదని.. దోషులను వెంటాడి, వేటాడి చట్టపరంగా శిక్షిస్తామని చెప్పారు.

## ఇది కారు, బుల్డోజర్ మధ్య జరిగే ఎన్నిక: కేటీఆర్

హైదరాబాద్: అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో పలువురు ఎంఐఎం నేతలు కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదని కాంగ్రెస్‌ను అడగాలన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలిచేది మాగంటి సునీతనే అని తెలిపారు. ఇది కారు, బుల్డోజర్ మధ్య జరిగే ఎన్నిక అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రౌడీయిజం పెరిగిపోయిందని విమర్శించారు. ఈ సర్కారు ఎవరినీ వ్యాపారాలు చేసుకోనివ్వడం లేదని దుయ్యబట్టారు.

## తుపాను నష్టంపై ప్రధాని మోదీతో వ్యక్తిగతంగా మాట్లాడతా

మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నీట మునిగిన పంట పొలాల నుంచి యుద్ధప్రాతిపదికన నీటిని మళ్లించి రైతులను ఆదుకోవాలని సీఎం స్పష్టం చేశారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి, శనివారం నాటికల్లా ఆ నీటిని పూర్తిగా మళ్లించే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గాల వారీగా స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. పంట దిగుబడి తగ్గిపోకుండా ఉండేందుకు శాస్త్రవేత్తల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా బాపట్ల జిల్లాలోనే అత్యధికంగా 60 శాతం వ్యవసాయ క్షేత్రాలు నీట మునిగినట్లు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బాపట్ల జిల్లాలో ఆదివారం నాటికి నీటి నిల్వలు లేకుండా చేస్తామని అధికారులు సీఎంకు హామీ ఇచ్చారు. మరోవైపు, కృష్ణా నదిలో వరద ఉధృతి ప్రస్తుతం తగ్గిందని అధికారులు వెల్లడించారు. మొంథా తుఫాన్ సహాయక చర్యల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సుమారు 100 మంది సిబ్బందిని గుర్తించి సన్మానించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం 10 గంటలకు ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన సూచించారు.

## కిషన్ రెడ్డి 'దేశద్రోహి' వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన అజారుద్దీన్

మొదటి పేజి తరువాయి

ఈ కార్యక్రమం నిరాడంబరంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఇతర కేబినెట్ సహచరులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వడంపై బీజేపీ నేత కిషన్ రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, తనకు ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదని మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, తనపై వచ్చినవి ఆరోపణలు మాత్రమేనని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు సరికాదని ఆయన అన్నారు. తనపై ఒక్క కేసులో కూడా నేరం రుజువు కాలేదని ఆయన స్పష్టం చేశారు. తన గురించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి పూర్తిస్థాయి అవగాహన లేదని వ్యాఖ్యానించారు. తన దేశభక్తి గురించి విమర్శలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొంతకాలంగా తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తనకు మంత్రి పదవి రావడానికి, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మంత్రిగా అవకాశం కల్పించినందుకు ఏ శాఖ ఇచ్చినా ఇబ్బంది లేదని అజారుద్దీన్ అన్నారు. మంత్రి పదవి దక్కినందుకు చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశద్రోహులకు మంత్రి పదవి ఎలా ఇస్తారని కిషన్ రెడ్డి ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై అజారుద్దీన్ పై విధంగా స్పందించారు.

## ఉప్పల్ లో 'ఏక్తా రన్'లో రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఐపిఎస్



ఉప్పల్, మహి న్యూస్, అక్టోబర్31: రాష్ట్రీయ ఏక్తా దివాస్ సందర్భంగా రాచకొండ కమిషనరేట్ పోలీసులు రన్ ఫర్ యూనిటీని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు, సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, ఎవరెస్ట్ అధిరోహించిన అన్విత రెడ్డి,అథ్లెంటిక్ కల్పన రెడ్డిలు జెండా ఊపి రన్ ప్రారంభించారు. ఉప్పల్ రింగ్ రోడ్ నుంచి ఉప్పల్ క్రికెట్ స్టేడియం వరకు 2కే రన్ నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. భారతదేశంలో ఉన్న పౌరులు అందరూ ఏకతాటిపై ఉన్నారు అని తెలియజేయడానికి రన్ ఫర్ యూనిటీ అని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచకొండ పోలీసు ఉన్నతాధికారులు, డీసీపీ మల్కాజిగిరి పద్మజ ఐపిఎస్, డీసీపీ క్రైమ్స్ అరవింద్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు



వికారాబాద్ జిల్లా/ పరిగి (మహి న్యూస్): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని పరిగి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ తొలి మహిళా ప్రధానిగా అనేక సంస్కరణను అమలు చేసి పేదల అభ్యున్నతికి కృషి చేసిన వీరవనిత ఇందిరా గాంధీ అని అన్నారు. గరీబి అటావో నినాదంతో పేదలకు కనీస అవసరాలు కూడు, గుడ్డ ,గూడు కల్పించి, రాజభరణాలు రద్దు చేసి బ్యాంకులను జాతీయం చేసిన ఘనత ఇందిరా గాంధీ కి దక్కుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయూబ్, కాంగ్రెస్ నాయకులు గానేమోని శ్రీనివాస్, చిన్న నరసింహులు,కుడుముల వెంకటేష్, ఆంజనేయులు, జగన్, ఎజాజ్, సర్వర్, నజీర్, రామకృష్ణారెడ్డి, నవాజ్, శ్రీకాంత్ రెడ్డి, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

## అప్పా జంక్షన్-మన్నేగూడ నాలుగు లైన్ రోడ్ పనులకు గ్రీన్ సిగ్నల్

### కోర్టు స్టే ఎత్తివేతతో రోడ్డు పనులు ప్రారంభం - ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా /పరిగి (మహి న్యూస్): పరిగి ఎమ్మెల్యే వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టి.రామ్మోహన్ రెడ్డి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తో కలిసి చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... అప్పా జంక్షన్-మన్నేగూడ వరకు రూ.1000 కోట్లతో నిర్మించనున్న నాలుగు లైన్ రహదారి పై గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఉన్న కేసు విచారణలో, కేవలం 150 చెట్లను మాత్రమే తొలగించి ఇతరచోట నాటాలని నిర్ణయించడంతో కోర్టు స్టే ఆర్డర్ ఎత్తివేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో నేటి నుండి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని, త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రమాదాలను తగ్గిస్తామని పేర్కొన్నారు. ట్రిబుల్ ఆర్, రేడియం రోడ్లు, హం పథకం ద్వారా ప్రతి గ్రామంలో బీటీ రోడ్ల నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పరిగి లో రన్ ఫర్ యూనిటీ: పాల్గొన్న పరిగి డీఎస్పీ శ్రీనివాస్




వికారాబాద్ జిల్లా /పరిగి (మహి న్యూస్): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఏక్తా దివాస్ లో భాగంగా పరిగి పట్టణంలో డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ నీ ఎమ్మార్వో కార్యాలయం నుండి అమరవీరుల చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్రం అనంతరం భారతీయ సమైక్య నిర్మాణంలో హైదరాబాద్ సంస్థనాన్ని విలీనం చేయడంలో సర్దార్ వల్లభాయి పటేల్ కీలకంగా వ్యవహరించారని అన్నారు. ఆపరేషన్ పోలో ద్వారా ఆర్మీ ని పంపించి హైదరాబాదును భారతదేశంలో భాగమయ్యేలా చేశారన్నారు. సంస్థానాల విలీనం లో సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన దౌత్య చతురత ధైర్యం దేశంపై ఉన్న నిస్వార్ధ ప్రేమ కారణంగా ఆయనను ఉక్కు మనిషిగా పేర్కొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మోహన్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, డిసిసి ప్రధాన కార్యదర్శి హనుమంతు, జిల్లా జెఎసి అధ్యక్షులు నాగేశ్వర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణ, విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# యువతలో హార్ట్ స్ట్రోక్స్!

### గతంలో ఎక్కువగా వృద్ధులకే పరిమితం

### ఇప్పుడు స్ట్రోక్‌వచ్చేవారిలో 15-20 శాతం మంది 45 ఏళ్లలోపు వారే...

### దేశంలో ఏటా 15-18 లక్షల స్ట్రోక్ కేసులు నమోదు

### జీవనశైలిలో మార్పులు, ఒత్తిడి నిర్ధారణ కానిపరిస్థితులే కారణం

### పలు అధ్యయనాల్లో వెల్లడి



హైదరాబాద్ : భారత యువతలో గుండెపోటు ప్రమాదం ఆందోళనకరమైన రీతిలో పెరుగుతోంది. గతంలో 50%-%60 ఏళ్లకు పైబడిన వారికే హార్ట్‌స్ట్రోక్స్ పరిమితమయ్యేవి. అందుకు భిన్నంగా ఇప్పుడు 45 ఏళ్లలోపు వారు 15%-%20 శాతం మంది గుండెపోటుకు గురవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే మాత్రం 45 ఏళ్లలోపు వారిలో ఇంతకంటే తక్కువ స్ట్రోక్ కేసులు సంభవిస్తున్నాయి. నగరాల్లో ఐటీ ఉద్యోగులు, నిపుణులు, అధిక స్క్రీన్ సమయం గడుపుతున్న విద్యార్థులు ముందస్తు వాస్కులర్ ప్రమాదాలను ఎదుర్కొంటున్నారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం 25-40 ఏళ్ల మధ్యలోని పురుషులు, మహిళలు గుండె సమస్యలకు గురవుతున్నారు. ఇవి కొన్నిసార్లు ప్రాణాంతకంగా కూడా మారుతున్నాయి. పాశ్చాత్య దేశాలతో పోలిస్తే భారతీయులు జన్యుపరంగా హృదయ సంబంధ వ్యాధులకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ పరిస్థితుల్లో 2023 లాన్సెట్ నివేదిక, ఇతర తాజా అధ్యయనాల ప్రకారం చూస్తే.. భారత్‌లో ఏటా 15%-%18 లక్షల స్ట్రోక్ కేసులు నమోదవుతున్నాయి. దేశంలో మరణాలకు రెండో ప్రధాన కారణం, వైకల్యానికి మూడో ప్రధాన కారణంగా గుండెపోట్లు నిలుస్తున్నాయి.

### ప్రమాదకారకాలపై నిపుణుల మాట

ఆధునిక జీవనశైలి మన శరీరం కంటే వేగంగా మన ధమనులను వృద్ధాప్యం బారిన పడేలా చేస్తోంది. మధుమేహం, అధిక రక్తపోటు,ధూమపానం, వాయు కాలుష్యం, దీర్ఘకాలిక ఒత్తిడి వంటి అంశాలు దీని పెరుగుదలకు కారణమవుతున్నాయి. స్లీప్ అప్నియా-స్ట్రోక్ మధ్య బలమైన సంబంధం ఉంది. స్ట్రోక్‌తో బాధపడుతున్న వారిలో దాదాపు 50-70 శాతం మందికి స్లీప్ అప్నియా కూడా ఉంటుంది. ఈ పరిస్థితి ఒక వ్యక్తి రాత్రిపూట గురక పెట్టడానికి, పదేపదే మేల్కొనడానికి కారణమవుతుంది. దీని వలన ఆక్సిజన్ స్థాయిలు పడిపోతాయి, రక్త నాళాలపై ఒత్తిడి వస్తుంది. ప్రారంభ స్ట్రోక్ తర్వాత చికిత్స చేయకపోతే, రెండేళ్లలోపు పునరావృతమయ్యే అవకాశం 50 శాతం ఉంటుంది.

### ప్రతి నిమిషం విలువైనది

యువ భారతీయుల జీవనశైలిలో మార్పులు, ఒత్తిడి వారిని మరింతప్రమాదంలో పడేస్తున్నాయని కార్డియాలజీ, న్యూరాలజీ నిపుణులు చెబుతున్నారు. స్ట్రోక్‌తో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడిన తర్వాత దాదాపు రెండు మిలియన్ల మెదడు కణాలు వేగంగా చనిపోతాయి కాబట్టి ఈ లక్షణాలను త్వరగా గుర్తించడం చాలా ముఖ్యం. అందువల్ల స్ట్రోక్ తర్వాత ప్రతి నిమిషం చాలా విలువైనది. ఈ నేపథ్యంలో 2025లో 'ఎవ్రీ మినిట్ కౌంట్స్'అనే ప్రచార అంశంతో గుండెపోట్ల నివారణ, లక్షణాల గుర్తింపు, సకాలంలో చికిత్స ప్రాముఖ్యతను వివరించేలా ప్రపంచవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.

### ఎలా గుర్తించాలి?

ముఖం, చేయి లేదా కాలు యొక్క ఒకవైపుఆకస్మిక బలహీనత లేదా తిమ్మిరి, మాటల్లో అస్పష్టత, మసకబారిన దృష్టి, తలతిరగడం, అకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి లాంటి ముందస్తుహెచ్చరికలను విస్మరించకూడదు. ఈ లక్షణాలున్న వారిని సీటీ/ఎమ్మారై స్కాన్ సౌకర్యాలున్నఆసుపత్రికి తీసుకెళ్లాలి

### ప్రమాదాన్ని ఇలా తగ్గించుకోవచ్చు..

గుండె జబ్బులను పూర్తిగా నివారించలేరు కానీ జీవనశైలిలో మార్పులు, అవగాహనతో ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ఫాస్ట్ ఫుడ్స్, ప్రాసెస్ చేసిన స్నాక్స్,అధిక చక్కెర పానీయాలు మానేయాలి. ఆహారంలో పుష్కలంగా పండ్లు, కూరగాయలు,తృణధాన్యాలు, ప్రొటీన్లను చేర్చాలి. ధూమపానం మానేయాలి. మద్యపానం పరిమితం చేయాలి. క్రమం తప్పకుండా వ్యాయామం, జాగింగ్,యోగా చేయాలి. ధ్యానం, శ్వాస వ్యాయామాలు, ఇతర అభిరుచులను అలవరుచుకుంటేఆందోళన తగ్గుతుంది. రోజూ మంచి నిద్ర (7-8 గంటలు) అవసరం. ఏడాదికోసారి రక్తపోటు, కొలెస్ట్రాల్ ,రక్తంలో చక్కెర స్థాయిలు, ఈసీజీ లాంటి పరీక్షలు చేయించుకుంటే సమస్యలను ముందుగానేగుర్తించే అవకాశం ఉంటుంది.

# యువతే లక్ష్యంగా వాగ్దానాల జల్లు

### ఆర్జేడీ యువ రాగం

### సంప్రదాయ కులం అస్త్రాన్ని పక్కన పెట్టిన ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్

దశాబ్దాలుగా బిహార్ ఎన్నికలను కుల రాజకీయాలు శాసిస్తున్నాయి. అయితే, రాష్ట్ర ఓటర్ల మనోగతానికి అనుగుణంగా ఆర్జేడీ యువ నేత, మహాగఠ్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ కొత్త పంథాలో దూసుకెళ్తున్నారు. రాష్ట్రంలో కులరాజకీయాల డోసును కాస్తంత తగ్గించి యువతే లక్ష్యంగా వాగ్దానాల జల్లు కురిపిస్తున్నారు. యువ తను పట్టి పీడిస్తున్న నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపుతానని ఇటీవల వాగ్దానం చేశారు. యువత పొరుగు రాష్ట్రాలకు వలసవెళ్లకుండా వాళ్ల కు ఇక్కడే ఉపాధి అవకాశాలు సృష్టిస్తానని హామీ ఇచ్చారు. అందుకోసం వలసల కట్టడి, ఆర్థిక మద్దతు, అభివృద్ధి నినాదాలను చేస్తున్నారు. వీటిని ముందుపెట్టి ఎన్నికల్లో భారీ లబ్ధి పొందేందుకు ప్రజల్లోకి వెళుతున్నారు. రాష్ట్రంలోని ఓటర్లలో 25 శాతం మంది యువ ఓటర్లే ఉన్నారు. కులం పేరు చెప్పి ఓట్లు అడిగే బదులు వారికి విద్య, ఉద్యోగం, ఉపాధి హామీలనిస్తూ తేజస్వీ యువరాగం అందుకున్నారు. ఈ రాగానికి యువత ఏస్థాయిలో మంత్ర ముగ్ధులు అవుతారో, ఈ మంత్రం ఏమేరకు పనిచేస్తుందనేది కొన్ని రోజుల్లోనే తేలిపోనుంది. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ పిలుపు మేరకు సంపూర్ణ క్రాంతి ఉద్యమంలోంచి నాయకులుగా ఎదిగిన లాలూ ప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్‌లు బిహార్‌లో వచ్చిన సామాజిక, రాజకీయ పరిణామాల్లో ప్రధాన పాత్ర పోషించారు. ఇద్దరు నేతలు మొన్నటివరకు కులాలకే అధిక ప్రాధాన్యతనిస్తూ కుల రాజకీయాలు చేశారు. తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్ అనుసరించిన పంథాను పక్కనబెట్టి తేజస్వీ యాదవ్ దూసుకెళ్తున్నారు. బిహార్‌లో యువ ఓటర్ల ధ్యాస ఇప్పుడు పెద్దగా కులం మీద లేదనే వాదన ఒకటి ఉంది. విద్యావకాశాలు అధికమవడం, పెరిగిన వలసలు, నగరీకరణతో యువతలో కుల ప్రస్తావన పెద్దగా లేదని తెలుస్తోంది. నిరుద్యోగ భూతాన్ని తరిమేసి ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించే నేతలకు జై కొట్టేందుకు యువ ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఈ అంచనాలతో యువతను తేజస్వీ ప్రధాన ఆయుధంగా మలుచుకుంటున్నారని తెలుస్తోంది.



### 1.63 కోట్ల మందే గురి

బిహార్‌లోని 243 నియోజకవర్గాల్లో మొత్తం 7.43 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 18%-%32 ఏళ్ల వయసు వారు ఏకంగా 1.63 కోట్ల మంది ఉన్నారు. ఇక కొత్త ఓటర్ల సంఖ్య 14 లక్షలుగా ఉంది. రాష్ట్రంలో అక్షరాస్యత రేటు 70.9 శాతం కాగా, నిరుద్యోగిత రేటు 10.3 శాతంగా ఉంది. రాష్ట్రంలోని యువతలో 20 శాతం కంటే ఎక్కువ మంది నిరుద్యోగులుగా నిట్టూర్చుతున్నారు. బిహార్‌లో సరైన ఉపాధి దొరక్క బతుకుజీవుడా అంటూ ఢిల్లీ, ముంబై వంటి నగరాలకు వలస వెళ్తున్నారు. యువత మెరుగైన నైపుణ్యం, విద్యా సామర్థ్యాల సముపార్జన కోసం ఆర్జనపై దృష్టిపెట్టారు. సంపాదించే ఆ కాసింత డబ్బుతో తర్వాత శిక్షణ, పోటీ పరీక్షల కోచింగ్‌కు వెళుతున్నారు. ఇలాంటి యువ ఓటర్లను దృష్టిలో ఉంచుకుని తేజస్వీ యాదవ్ 'ఛత్ర యువ సంసద్'కార్యక్రమం మొదలెట్టారు. యువజన కమిషన్‌ను ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు ఉచితంగా కోచింగ్ ఇప్పిస్తామని, వెనుకబడిన విద్యార్థులకు ఇంటి నుంచే ట్యూటర్ల సౌకర్యం కల్పిస్తామని హామీ గుప్పించారు. సైన్స్, గణితం, ఇంగ్లిష్‌లో వెనుకబడిన విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు నేరుగా వెళ్లి వారి కోసం అదనపు సమయం కేటాయిస్తారని తేజస్వీ హామీ ఇచ్చారు. బిహార్ విశ్వవిద్యాలయాల నుంచి విద్యార్థులు జాతీయ స్థాయి ఉన్నత విద్యాసంస్థల్లో చేరేలా, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకునే స్థాయిలో బిహార్ విద్యా వ్యవస్థను సంస్కరిస్తానని వాగ్దానం చేశారు. ఈ హామీల దృష్ట్యానే బిహార్ తదుపరి ముఖ్యమంత్రిగా తేజస్వీ యాదవ్‌ను ఇష్టపడుతున్నట్లు యువ ఓటర్ల మనోగతం వెల్లడైందని తాజా సర్వేలో తేలింది. 27.7 శాతం మంది మాత్రమే ప్రస్తుత ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు అనుకూలంగా స్పందించారు.

# అన్యాయానికి పరిహారం

ఒక పెత్తందారు కన్నెర్ర చేయటం వల్లనో, ఒక ఉన్నతాధికారి కక్షబూనటం వల్లనో, లేదా వ్యవస్థలు ఏకమై ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసులు పెట్టడం వల్లనో జైళ్లలో మగ్గి చివరకు నిర్దోషులుగా విముక్తులవుతున్నవారికి ఊరటనిచ్చే అంశమిది. అలాంటివారికి నష్టపరిహారం చెల్లించేందుకు అనువైన మార్గదర్శకాలు రూపొందించాలని సర్వోన్నత న్యాయస్థానం సంకల్పించింది. అమాయకుల్ని కేసుల్లో ఇరికించటం, ఏళ్ల తరబడి వారు జైలు పాలవటం మన దేశంలో ఎప్పటి నుంచో రొటీన్‌గా సాగిపోతోంది. నిందితులు నిర్దోషులని తేలినప్పుడు న్యాయస్థానాలు దర్యాప్తు చేసినవారినీ, ప్రాసిక్యూషన్‌నూ తప్పుబట్టడం తరచూ కనబడుతుంది. కానీ అందువల్ల ఒరిగేదేమిటి? సమాజం వారిని అమాయకులుగా, సాధారణ పౌరులుగా పరిగణించి ఆదరిస్తుందా? అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాల్లో అలాంటివారు నష్టపరిహారం పొందేందుకు నిబంధనలున్నాయి. అమెరికాలో జైల్లో మగ్గిన కాలానికి ఏడాదికి 50,000 డాలర్ల చొప్పున పరిహారం చెల్లిస్తారు. బ్రిటన్‌లో దీర్ఘకాలం జైల్లో ఉన్న నిర్దోషులకు 10 లక్షల పౌండ్లు ఇస్తారు. జర్మనీలో ఇది రోజుకు 75 యూరోలు. మన దేశంలో అభాగ్యులు కేసుల నుంచి విముక్తి పొందటమే అదృష్టమన్నట్టు సరిపెట్టుకుంటున్నారు. పరిహారం సంగతలా ఉంచి వారికి ప్రభుత్వం నుంచి క్షమాపణైనా దక్కటం లేదు. శిక్ష పడుతున్న కేసులు మన దేశంలో ఏటా సగటున 54 శాతం మించటం లేదన్న గణాంకాల్ని గమనిస్తే ఇలాంటి అభాగ్యులెందరో అర్థమవుతుంది. పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు భావించిన కేసు పూర్వాపరాలు చూస్తే ఈ నిర్ణయం ఎంత సరైందో అర్థమవుతుంది. మహారాష్ట్రలో 2013లో ఒక మైనర్‌పై అత్యా చారం చేసి హతమార్చాడన్న కేసులో ఇరుక్కుని జైల్లో మగ్గుతూ, 2019లో ఉరిశిక్ష పడిన నిరుపేద పౌరుడి కథ ఇది. ఆయన పన్నెండేళ్ల కారాగారవాసంలో ఆరేళ్లు ఉరికంబం నీడన బతుకీడ్చాడు. అతణ్ణి అన్యాయంగా ఇరికించారనీ, దర్యాప్తు మొత్తం తప్పులతడకనీ సుప్రీంకోర్టు నిర్ధారించింది. ఈ ఏడాది ఇంతవరకూ ఉరిశిక్ష పడిన ముగ్గురు ఖైదీల విషయంలో సుప్రీంకోర్టు ఇలాంటి తీర్పే ఇచ్చింది. నిజానికి 2014లోనే ఒక కేసులో తీర్పునిస్తూ క్రిమినల్ కేసుల్లో నిందితులు నిర్దోషులుగా తేలితే దర్యాప్తు అధికారుల్ని బాధ్యులుగా పరిగణించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అది ఏ మేరకు అమలవుతున్నదో అనుమానమే. అమాయకులపై తప్పుడు కేసులు బనాయించటం వల్ల అనేక విధాల నష్టం. నిజమైన దోషులు తప్పించుకు తిరుగుతూ అవే



నేరాల్ని పదే పదే చేస్తుంటారు. అమాయక పౌరులు నిస్సహాయంగా జైల్లో మగ్గుతారు. దోషులు తప్పించుకు తిరుగుతున్నా, చేయని నేరానికి నిర్దోషులు శిక్ష అనుభవిస్తున్నా ప్రజలకు చట్టబద్ధ పాలనపై విశ్వాసం పోతుంది. రాజ్యాంగంలోని 21వ అధికరణం జీవించే హక్కుకూ, వ్యక్తి స్వేచ్ఛకూ పూచీ పడుతున్నా దానికి అనుగుణంగా అక్రమ కేసుల వల్ల జైలు పాలైనవారికీ, ఆలస్యంగా న్యాయం దక్కినవారికీ పరిహారం చెల్లించే చట్టాలు లేవు. జీవితంలో విలువైన కాలాన్నీ, స్వేచ్ఛనూ, పరువు మర్యాదలనూ కోల్పోయి మానసి కంగా కుంగిపోయినవారికి పరిహారం పొందే హక్కుండి తీరాలి. మానవీయ దృక్పథంతో న్యాయస్థానాలు కొన్ని కేసుల్లో పరిహారానికి ఆదేశిస్తున్నాయి. బాధితులందరికీ న్యాయం జరగాలంటే తగిన చట్టం అవసరం.

తొంభై శాతం అంగవైకల్యం ఉన్న ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా, మరికొందరు తప్పుడు కేసుల పర్యవసానంగా పదేళ్లు కారాగారంలో మగ్గటం, చివరకు నిర్దోషులుగా విడుదల కావటం ఇటీవలి వైనం. విడుదలైన కొన్నాళ్లకే ప్రొఫెసర్ సాయిబాబా తీవ్ర అనారోగ్యంతో కన్నుమూశారు. 2017లో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ సందర్భంగా పాకిస్తాన్ అనుకూల నినాదాలు చేశారని ఆరోపిస్తూ 17 మందిపై దేశద్రోహ నేరంతో సహా పలు కేసులు పెట్టగా ఆరేళ్ల తర్వాత నిర్దోషులుగా బయటపడ్డారు. గూఢచర్యం, దేశద్రోహం కేసుల్లో ఇరుక్కున్న ఇస్రో శాస్త్రవేత్త నంబి నారాయణన్ రూ. 50 లక్షల పరిహారం పొందటానికి రెండు దశాబ్దాలు పట్టింది. ఇలాంటి పోకడలు ఆగాలంటే, తప్పుడు కేసుల పర్వానికి తెరపడాలంటే పరిహారం చెల్లించే విధానం రావాల్సిందే!

మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
శనివారం - 01 - నవంబర్ - 2025

# కండరాలకూ జ్ఞాపకాలు!

## కండరాలను ఎంత ఉపయోగిస్తే అంత ప్రయోజనం
## 'ప్రతికూల జ్ఞాపకాల'తో పట్టు సడలే అవకాశం



తెలివితేటలు, జ్ఞాపకశక్తి వంటి మాటలు వినగానే.. అవి మన మెదడు సొత్తే అనుకుంటాం. కానీ, మన శరీరం అంతటా అల్లుకొని ఉండే కండరాలకు కూడా సొంత తెలివితేటలు, జ్ఞాపకాలు ఉంటా యట. ఇది ఆశ్చర్యంగా అనిపించవచ్చు గానీ, వాస్తవం. అంతెందుకు..? వ్యాయామం చేస్తే కండరాలు బలంగా పెరుగుతాయని మనకు తెలుసు. అయితే, మానేసిన కొన్నాళ్లకు ఆ విషయాన్ని మనం మర్చిపోవచ్చు. కానీ, కండరాలు మాత్రం మర్చిపోవట. మళ్లీ కొన్నేళ్ల తర్వాత తిరిగి మొదలు పెట్టినా, మన కండరాలు గతంలో కన్నా చప్పున స్పందిస్తాయని అధ్యయనాల్లో తేలింది. కండరాలకూ సొంత తెలివితేటలతో కూడిన జ్ఞాపకాలుంటాయట. మీరు కండరాలను ఎంతగా ఉపయోగిస్తే, అవి మీ శరీరానికి అంత ఎక్కువ శాశ్వత ప్రయోజనకరమైన వనరుగా మారుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. సైకిల్ తొక్కేట ప్పుడు శరీరంలో కండరాలు కలిసికట్టుగా సమన్వయంతో కదలటం నేర్చుకుంటాయి. ఆ చలనశీలతను చిరకాలం పాటు గుర్తుపెట్టుకుంటాయి.

**జ్ఞాపకాలతో మరింత వేగంగా!**

కండరాల ఎపిజెనెటిక్ జ్ఞాపకశక్తిపై షార్పుల్స్ విశేష పరిశోధనలు చేశారు. ప్రవర్తన, పరిస్థితుల ప్రభావం వల్ల జన్యు వ్యక్తీకరణలో వచ్చే మార్పులను ఎపిజెనెటిక్ మార్పులు అంటారు. అంటే, జన్యువులు మారవు, కానీ అవి పనిచేసే విధానం మారుతుంది. వ్యాయామంతో కలిగే జన్యు వ్యక్తీకరణ మార్పులకు సంబంధించిన జ్ఞాపకాలను కండరాలు చిరకాలం గుర్తుంచుకుంటాయని షార్పుల్స్ పరిశోధనలు రుజువు చేశాయి. కొన్ని నెలలు లేదా ఏళ్ల విరామం తర్వాత మళ్లీ వ్యాయామం ప్రారంభించినప్పుడు పాత జ్ఞాపకాల ఆధారంగా మొదట్లో కన్నా వేగంగా కండరాలు బలం పుంజుకుంటాయని ఆయన కనుగొన్నారు.

**చప్పున గుర్తుతెచ్చుకుంటాయి**

మన కండరాల్లోని కణాలు.. శరీర కదలికలను, వ్యాయామాన్ని కలకాలం గుర్తుపెట్టుకోగలవు. అవసరమైనప్పుడు వాటిని మళ్లీ చప్పున గుర్తుతెచ్చుకోవటమే కాకుండా మొదట్లో కన్నా చప్పున స్పందించగలవని ఇటీవల వైద్య పరిశోధనల్లో వెల్లడైంది. 'మానవ శరీరంలో అవయవాల చుట్టూ ఉండే కండరాల్లోని కణాలు విలక్షణమైనవి. అవి పొడవుగా, పల్చగా, పోగుల మాదిరిగా ఉంటాయి. నిద్రాణంగా ఉండే ఈ మూల కణాలు శరీర కదలికలు/వ్యాయామం వల్ల వత్తిడి కలిగినప్పుడు లేదా గాయం తగిలినప్పుడు చైతన్యవంతమై కండర వృద్ధికి దోహదపడతాయి. చాలా ఏళ్ల తర్వాత మనం మళ్లీ వ్యాయామం చేసినా గతంలో కన్నా చప్పున స్పందిస్తాయని మా పరిశోధనల్లో తేలింది' అంటారు కండర శాస్త్రవేత్త డా. ఆడమ్ షార్పుల్స్. ఆయన ఓస్లోలోని నార్వేజియన్ స్కూల్ ఆఫ్ స్పోర్ట్ సైన్సెస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

**ప్రతికూల జ్ఞాపకాలు!**

కండర కణాలు అన్ని వేళలా 'సానుకూల జ్ఞాపకాల'తోనే స్పందించాలనేం లేదు. ఒక్కోసారి 'ప్రతికూల జ్ఞాపకాల'తోనూ ప్రతిస్పందించవచ్చు. ప్రతికూలతకు వ్యాధి కూడా కారణం కావచ్చు. ఉదాహరణకు.. పదేళ్ల క్రితం రొమ్ము కేన్సర్‌కు చికిత్స పొందిన మహిళల్లో కండరాలు 'ప్రతికూల జ్ఞాపకాల' వల్ల వారి వయసుకు మించి పట్టు సడలి, క్షీణించటాన్ని షార్పుల్స్ గుర్తించారు. వారితో ఏరోబిక్ ఎక్సర్‌సైజులు చేయించినప్పుడు కండరాలు వయసుకు తగిన రీతిలో పున రుజ్జీవనం పొంది పటుత్వం పెంచుకోగలిగాయి. ప్రతికూల జ్ఞాపకాలపై సానుకూల జ్ఞాపకాలు పైచేయి సాధించటం వల్లనే ఇది సాధ్యమైందని ఆయన అంటారు.

# మనిషి 'తిరుగుడు' ఎక్కువైంది!

## సంచార గతిని మార్చేసిన పారిశ్రామిక విప్లవం
## సగానికి పడిపోయిన జలచరాల సంచారం..
## 40 రెట్లు పెరిగిన మానవుల కదలికలు



స్పెషల్ డెస్క్: 1850ల నాటి మాట... అప్పట్లో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లాలంటే నడకే ప్రధాన సాధనం. కానీ, 2025 నాటికి పూర్తిగా పరిస్థితి మారిపోయింది. ఎక్కడికైనా వెళ్లాలంటే కార్లు, బస్సులు, మోటారు సైకిళ్లు, రైళ్లు, విమానాలు.. ఇలా ఎన్నో మార్గాలు. అందుకే, ఇప్పుడు నడక అనేది ఏకంగా ఏడో స్థానానికి వెళ్లిపోయింది. భూమిపై ఉన్న జలచరాల సంచారం (టోటల్ బయోమాస్ మూవ్‌మెంట్ – టీబీఎం) పారిశ్రామిక విప్లవం తరువాత.. సగానికి తగ్గిపోయింది. అదే సమయంలో మనుషులు అటూ ఇటూ తిరగడం 40 రెట్లు పెరిగింది. సుప్రసిద్ధ నేచర్ జర్నల్‌కి చెందిన 'నేచర్ ఎకాలజీ అండ్ ఎవల్యూషన్' విభాగంలో ప్రచురితమైన అధ్యయనం ఈ ఆసక్తికర వివరాలు వెల్లడించింది. భూమిపై జలచరాల సంచారం (టోటల్ బయోమాస్ మూవ్‌మెంట్ – టీబీఎం) పారిశ్రామిక విప్లవం తరువాత తగ్గిపోవడానికి ప్రధాన కారణం.. చేపలు, తిమింగలాలను మనుషులు వేటాడటమే. చెప్పాలంటే మొత్తం మానవుల టీబీఎంలో.. భూమిపై ఉన్న జంతువులు, జలచరాలు, పక్షుల టీబీఎం ఆరోవంతు మాత్రమేనట. ప్రస్తుతం మానవ సంచారంలో దాదాపు 65 శాతం.. మోటారు వాహనాల ద్వారానే జరుగుతోంది. నడక ద్వారా 20 శాతం ఉంటే.. సైకిల్ ద్వారా జరుగుతున్నది మరో 20 శాతం. విమానాల ద్వారా తిరుగుతున్నవారు 10 శాతం కాగా, రైల్వేల ద్వారా ప్రయాణిస్తున్నవారు 5 శాతం.

### ఆ నాలుగూ కారణం

ఈ అధ్యయనంలో అమెరికా, జర్మనీ, ఇజ్రా యెల్‌కు చెందిన శాస్త్రవేత్తలు పాలుపంచుకున్నారు. వీరు మానవ ప్రయాణాలు పెరగడానికి కార ణాలుగా ప్రధానంగా 4 అంశాలను పేర్కొన్నారు.

జనాభా పెరుగుదల,,మోటారు వాహనాల వాడకం పెరగడం ,శిలాజ ఇంధనాల వినియోగంలో వృద్ధి,ప్రయాణాలకు అనువైన సదుపాయాలు, సౌకర్యాల ఏర్పాటు,అధిక ఆదాయ దేశాల్లో ఉన్నవారు ప్రపంచ జనాభాలో దాదాపు 16 శాతం. మొత్తం జనాభా కదలికల్లో వీరిదే దాదాపు 30 శాతం.,అల్పాదాయ దేశాల్లో ఉన్న వారు ప్రపంచ జనాభాలో 9 శాతం. మొత్తం జనాభా సంచారంలో వీరి వాటా కేవలం 4 శాతమే.

### 95 శాతానికి పెరిగింది

1850లలో..ఈ భూమిపై మొత్తం క్షీరదాల్లో క్రూర మృగాల (జలచరాలు, వన్యప్రాణులు) బరువు 50 శాతం ఉంటే.. మానవులు, ఇతర పెంపుడు జంతువుల బరువు 50 శాతం ఉండేది. 2020 నాటికి మానవులు, ఇతర పెంపుడు జంతువుల బరువు ఏకంగా 95 శాతానికి పెరిగిపోయింది.

### ఏమిటీ టోటల్ బయోమాస్ మూవ్‌మెంట్

మనుషుల జనాభాతో పోలిస్తే భూమిపై పక్షులు, జంతువులు చాలా ఎక్కువ కదా, మరి అవి ప్రయాణించే దూరం కంటే మనుషులు ప్రయాణించే దూరం ఎక్కువ కావడం ఏమిటి? అనే సందేహం చాలామందికి వస్తుంది. అందుకు ప్రధాన కారణం దీన్ని గణించడానికి తీసుకునే ప్రమాణమే. పర్యావరణ ఆరోగ్యం, సహజ వనరుల వినియోగం, పర్యావరణంపై మానవుల ప్రభావం వంటి అంశాలు అంచనా వేసేందుకు శాస్త్రవేత్తలు 'టోటల్ బయోమాస్ మూవ్‌మెంట్'ను ఉపయోగిస్తారు. దీని ప్రమాణమే గ్రాస్ టన్ను కిలోమీటర్లు (జీటీకే). ఒక ప్రాణి బరువును, అది ఒక ఏడాదిలో ప్రయాణించిన దూరంతో గుణిస్తే వచ్చేదే జీటీకే. ఎంత ఎక్కువ బరువు ఉంటే అంత ఎక్కువ జీటీకే అన్నమాట. చాలా పక్షులు ఏటా కొన్ని వేలు, లక్షల కిలోమీటర్లు వలస పోతుంటాయి. కానీ వాటి బరువు చాలా తక్కువగా ఉండటం వల్ల వాటి టీబీఎం చాలా తక్కువగా ఉంటుంది.


# యూపీఐ లావాదేవీల్లో గుత్తాధిపత్యం!

## రెండు సంస్థల చేతుల్లోనే 80 శాతం వాటా
## దీన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి
## ఆర్థిక శాఖ, ఆర్‌బీఐని కోరిన ఐఎఫ్ఎఫ్



న్యూఢిల్లీ: యూపీఐ లావాదేవీల్లో 80 శాతాన్ని కేవ లం 2 సంస్థలు (ఫోన్‌పే, జీపే) నియంత్రిస్తున్నాయంటూ.. ఈ ఏకాగ్రత రిస్క్‌ను తగ్గించేందుకు చ ర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖ, ఆర్‌బీఐని ఇండి యా ఫిన్‌టెక్ ఫౌండేషన్ (ఐఎఫ్ఎఫ్) కోరింది. ఫిన్ టెక్ పరిశ్రమకు స్వీయ నియంత్రణ మండలిగా వ్య వహరిస్తున్న ఐఎఫ్ఎఫ్.. ఇందుకు సంబంధించి వి ధాపరమైన సూచనలు చేసింది. ఐఎఫ్ఎఫ్‌లో భాగమైన ఫిన్‌టెక్ సంస్థలతో విస్తృతమైన సంప్రదింపుల అనంతరం వీటిని రూపొందించినట్టు తెలిపింది. యూపీఐపై 30 థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్లు (టీపీఏపీలు) ఉండగా.. 80 శాతానికిపైగా లావాదేవీలు రెండు సంస్థల నియంత్రణల్లోనే ఉన్నాయి. ఈ రెండు సంస్థలు దోపిడీ ధరలతో (భారీ తగ్గింపులు, క్యాష్ బ్యాక్ ఆఫర్లు)తమ ఆధిపత్యాన్ని కాపాడుకుంటాయి. ముఖ్యంగా చిన్న సంస్థలు, దేశీ పోటీదారులను పోటీపడకుండా చేస్తాయి. ప్రభుత్వానికి చెందిన భీమ్ ప్లాట్‌ఫామ్ సైతం ఈ ద్వందాధిపత్యం దెబ్బకు మార్కెట్ వాటాను కోల్పోయింది. యూపీఐ లావాదేవీలను నగదుగా మార్చుకునే అవకాశం (ఎండీఆర్ చార్జీలు) లేకపోవడం, ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలకు ఉన్న నిధుల వెసులుబాటు.. కొత్త సంస్థలు, చిన్న సంస్థల ప్రవేశానికి గట్టి అవరోధంగా నిలుస్తాయి. పోటీని అణచివేస్తాయి. ఒక సంస్థ గరిష్టంగా 30 శాతం లావాదేవీలకే సేవలు అందించాలన్న పరిమితిని అమలు చేయడంలో ఎన్‌పీసీఐ జాప్యం చేస్తుండడం నిర్వహణపరమైన సవాళ్లను, ఏకాగ్రత రిస్క్‌ను తెలియజేస్తుంది. ఎన్‌పీసీఐ ఈ పరిమితి అమలు చేయడానికి ముందుగానే ఈ సంస్థలు మరింత పెద్దవిగా అవతరించేందుకు అనుమతించడం.. వ్యూహాత్మకమే అనిపిస్తోంది. ఈ ఏకాగ్రత రిస్క్‌ను తగ్గించేందుకు బడా రెండు యూపీఐ సంస్థలు (టీపీఏపీలు) కాకుండా మిగిలిన వాటికి యూపీఐ ప్రోత్సాహకాల్లో అధిక వాటా అందుకునేలా చర్యలు తీసుకోవాలి. లేకపోతే సదరు రెండు అతిపెద్ద టీపీఏపీలు ప్రోత్సాహకాల్లో అధిక భాగాన్ని పొందుతాయి. ఒక టీపీఏపీకి ప్రోత్సాహకాల్లో 10 శాతం గరిష్ట పరిమితి విధించాలి.

# దేశంలో డేటా సెంటర్ల దూకుడు..
# త్వరలోనే డబుల్..



ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వాటిని పరిగణనలోకి తీసుకుంటే దేశీయంగా డేటా సెంటర్ల (డీసీ) సామర్థ్యం 2027 నాటికి రెట్టింపు కానుంది. ప్రాజెక్టులను వేగవంతం చేస్తే 2030 నాటికి అయిదు రెట్లకు పెరగనుంది. డేటా లోకలైజేషన్ చట్టాలు, సానుకూల నియంత్రణ విధానాలు, ప్రభుత్వాల నుంచి సబ్సిడీలు, క్లౌడ్ వినియోగం పెరుగుతుండటం మొదలైన అంశాలు ఇందుకు దోహదపడనున్నాయి. మెక్వారీ ఈక్విటీ రీసెర్చ్ ఒక నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది. దీని ప్రకారం ప్రస్తుతం భారత్‌లో 1.4 గిగావాట్ల డీసీ సామర్థ్యం ఉండగా, 1.4 గిగావాట్ల ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. మరో 5 గిగావాట్లు ప్రణాళిక దశలో ఉన్నాయి. టెక్ దిగ్గజం గూగుల్ వచ్చే అయిదేళ్లలో భారత్‌లో 15 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనుంది. దీనికి తోడు టీసీఎస్ సైతం 6.5 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనుండగా, మెటా–గూగుల్ భాగస్వాములుగా జామ్‌నగర్‌లో సమగ్ర ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు జియో ఇటీవల ప్రకటించింది. అలాగే ఏడబ్ల్యూఎస్ భారత్‌లో క్లౌడ్ కెపాసిటీని 2030 నాటికి 13 బిలియన్ డాలర్స్ పెట్టుబడులు పెట్టనుంది.

# ఈవీలకు 'చార్జింగ్' పెంచాలి!

- ప్రతి వెయ్యి ఈవీలకు 5 చార్జింగ్ స్టేషన్లే
- అమెరికా, చైనా, నార్వేలతో పోలిస్తే తక్కువే
- దేశంలోని 30వేల స్టేషన్లలో పనిచేస్తున్నవి సగమే
- 2030 నాటికి దేశంలో 1.32 లక్షల స్టేషన్లు అవసరం



2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో (ఏప్రిల్-సెప్టెంబర్) దేశంలో 91,726 విద్యుత్ వాహనాలు (ఈవీ) అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే సమయంలో అమ్ముడైనవి 44,172 మాత్రమే. కానీ ఇందుకు తగ్గట్టుగా చార్జింగ్ స్టేషన్లు పెరగడం లేదు. ఈ ఏడాది ఆగస్టు నాటికి దేశంలోని పబ్లిక్ చార్జింగ్ స్టేషన్ల సంఖ్య 30లు. ఇందులో పనిచేస్తున్నవి 14,450. దేశంలో ఈవీలు పెరుగుతున్నంత వేగంగా చార్జింగ్ స్టేషన్లు పెరగడం లేదు. ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫడా) గణాంకాల ప్రకారం.. 2024-25లో మొత్తంగా అమ్ముడైన ఈవీలు 1.1 లక్షలు. అదే, ఈ ఆర్థిక సంవత్సరం ఆరు నెలల్లోనే అమ్మకాలు 90 వేల మార్కును దాటేశాయి. 2014-15లో మొత్తం కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లలో ఈవీల వాటా కేవలం 0.01 శాతం. అదే 2024-25లో 7.31 శాతం. కానీ ఇందుకు తగ్గట్టుగా పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లు పెరగడం లేదు. 2021-22లో దేశంలో ఉన్న స్టేషన్లు 1,800. ఈ ఏడాది ఆగస్టు నాటికి ఇవి 30 వేలకు పెరిగాయి. ఇందులో 15,550 పనిచేయడం లేదు.



### ప్రతి 50 కి.మీ.కి ఒకటి

కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది జూన్ నాటికి దేశంలోని 91 శాతం జాతీయ రహదారుల్లో ప్రతి 50 కిలోమీటర్లకు కనీసం ఒక ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్ ఉంది. ప్రపంచంలోని అగ్ర దేశాలతో పోలిస్తే మనదేశంలో చార్జింగ్ స్టేషన్లు, అందులోనూ ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్ల సంఖ్య తక్కువే. చైనాలో ప్రతి 100 కిలోమీటర్లకు 100 స్టేషన్లు ఉన్నాయి. అమెరికాలో ఈ సంఖ్య 70. అత్యధికంగా నార్వేలో 100 కి.మీ.కి 180 ఉన్నాయి. చైనాలోని ప్రతి 1,000 స్టేషన్లలో 45 శాతం ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లు. ఈ సంఖ్య నార్వేలో అత్యధికంగా 70 శాతం.

### స్టేషన్లు - సమస్యలు

నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్ల చాలా ఈవీ చార్జర్లు చార్జింగ్‌కు పనికిరావడం లేదు. ఆయా కంపెనీల కార్లకు సంబంధించిన యాప్స్, చెల్లింపు వ్యవస్థలు సరిగ్గా పనిచేయడం లేదని కొందరు ఫిర్యాదు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 90 శాతం ఈవీల చార్జింగ్ ఇంటి దగ్గర లేదా పనిచేసే ప్రదేశాల్లోనే జరుగుతోంది. మెట్రో నగరాలు కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉండే చార్జింగ్ స్టేషన్ల వినియోగం తక్కువగా ఉంటోందని, అందువల్ల తాము పెట్టిన పెట్టుబడులు కూడా గిట్టుబాటు కావడం లేదని కంపెనీలు అంటున్నాయి.

### 72,300 స్టేషన్ల లక్ష్యం

కేంద్ర ప్రభుత్వం ఈవీలను ప్రోత్సహించడానికి ఫేమ్ 2 కింద ఇప్పటికే 7,400 స్టేషన్ల ఏర్పాటులో తోడ్పాటు అందించింది. మొత్తంగా దేశ వ్యాప్తంగా 72,300 స్టేషన్లు ఏర్పాటుచేయాలన్నది కేంద్రం లక్ష్యం. ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ రెడ్‌సీర్ నివేదిక ప్రకారం.. 2030 నాటికి దేశంలో 1.32 లక్షల స్టేషన్లు అవసరమవుతాయి. సగటున ప్రతి 1,000 ఈవీలకు 45–50 ఉండాలి. మెట్రోల్లోనే 62 శాతం దేశంలోని చార్జింగ్ స్టేషన్లలో సుమారు 62 శాతం ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లోనే ఉన్నాయి. కానీ, ఈవీల అమ్మకాలు పెరుగుతున్న మెట్రోయేతర నగరాల్లో మాత్రం 38 శాతమే ఉన్నాయి. ఎంట్రీ లెవెల్ కార్ల అమ్మకాల్లో సగానికిపైగా టాప్ - 20 నగరాల్లో కాకుండా.. బిహార్, ఆంధ్రప్రదేశ్, యూపీ, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని చిన్న నగరాల్లోనే జరగడం గమనార్హం.

# తిండిలోనే ఉంది.. తూగుటుయ్యాల!

## మంచి ఆహారంతో సుఖనిద్రకు ఆహ్వానం
## పండ్లు, కూరగాయలు రెప్పల్ని వాల్చేస్తాయి
## వేపుళ్లు, కారాలు నిద్రను తరిమేస్తాయి

స్పెషల్ డెస్క్: పగటి పూట పండ్లు, కూరగా యలు, సంక్లిష్ట (నెమ్మదిగా జీర్ణమయ్యే) కార్బోహైడ్రేట్‌లను తీసుకునే వారు కలతలు లేని, ప్రశాంతమైన నిద్రను ఆస్వాదిస్తున్నారట. అందుకు భిన్నంగా – చక్కెర, ప్రాసెస్ చేసిన పదార్థాలు అధికంగా ఉన్న ఆహారాలు.. శారీరక అసౌకర్యానికి, నిద్రాభంగానికి కారణం అవుతున్నాయట. ప్రముఖ జర్నల్ 'స్లీప్ హెల్త్'లో తాజాగా ప్రచురితమైన అధ్యయనం ఈ విషయాలు వెల్లడించింది. నిద్రలేమికి ఒత్తిడి, గంటల తరబడి స్క్రీన్‌ను చూడటం, క్రమరహితమైన పని వేళలు ప్రధాన కారణాలుగా ఉన్నప్పటికీ... నిద్రను నియంత్రించటంలో ఆహారం బలమైన సహాయక పాత్రను పోషిస్తుంది. ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు వంటి వాటితో కూడిన పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు.. శరీర ధర్మాల సహజ లయను నిర్వహించడానికి, వాపుల గుణాన్ని తగ్గించడానికి, జీర్ణక్రియకు, తద్వారా మంచి నిద్రకు దోహదపడతాయని అధ్యయనంలో తేలింది. రోజుకు ఏడు నుంచి తొమ్మిది గంటలు నిద్రించే అమెరికన్ యువతపై ఈ అధ్యయనం జరిగింది. ఆహారం నిద్రను ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకోటానికి వారి ఆహారపు అలవాట్లను, మణికట్టుకు అమర్చే నిద్ర మానిటర్‌ల రీడింగ్‌లను అధ్యయనవేత్తలు పరిగణనలోకి తీసుకున్నారు.

### ప్రాసెస్డ్ ఫుడ్స్ వద్దు

చక్కెర, ప్రాసెస్డ్ పదార్థాలు అధికంగా ఉన్న ఆహారాలు అసౌకర్యాన్ని, రాత్రిపూట తరచూ మెలకువ రావటానికి కారణం అవుతున్నాయి. కొన్ని ఆహారాలు సహజంగా నిద్ర నాణ్యతను పెంచుతున్నాయి. అరటిపండ్లు, కివీ పళ్లు, టార్ట్ చెర్రీస్ (పుల్లటి చెర్రీలు) సహజ మెలటోనిన్‌ను, సెరటోనిన్ కలిగి, నిద్ర స్పందనలను నియంత్రిస్తున్నాయి. పాలకూర, క్యాబేజీ రకం ఆకుకూరలలోని మెగ్నీషియం కండరాలను సడలిస్తోంది. గింజలు, అవకాడోలు, చిలగడదుంపలు నిద్ర హార్మోన్లను సమతులం చేయడంలో సహాయకారిగా ఉంటున్నాయి.

### సమయమూ ముఖ్యమే

ఆహారంతో పాటుగా, అది తీసుకునే సమయం కూడా నిద్రకు చాలా ముఖ్యం. ఆలస్యంగా తీసుకుంటే ఆరోగ్యకరమైన ఆహారాలు కూడా నిద్రకు ఆటంకం కలిగిస్తాయి. అధిక ప్రొటీన్‌లు లేదా కారంగా ఉండే వంటకాలు అజీర్ణాన్ని రేకెత్తిస్తాయి. కెఫిన్, డార్క్ చాక్లెట్ నిద్రను ఆలస్యం చేస్తున్నాయి. మధ్యాహ్న భోజనాన్ని సమృద్ధిగా తీసుకోవాలి. అది జీర్ణక్రియ బలంగా ఉండే సమయం. రాత్రి భోజనం తేలికగా, సమతులంగా ఉండాలి, రాత్రి 8 గంటలలోపు, లేదా నిద్రవేళకు కనీసం 2 గంటల ముందు తినటం పూర్తి చేయాలి. పడుకునే ముందు ఒక చిన్న చిరుతిండి, అరటిపండు, గోరువెచ్చని పాలు లేదా నానబెట్టిన బాదం తినటం వల్ల అర్ధరాత్రి ఆకలిగా అనిపించదు.

### 'ప్రశాంత పోషకాలు'

ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం అధికంగా ఉండే ఆహారాలు.. పాలు, గింజలు వంటివి. ఇవి నిద్ర హార్మోన్లను తయారు చేయటంలో కీలకం మెగ్నీషియం,విటమిన్‌బి6..ఆకుకూరలు, అరటిపండ్లు, అవకాడోలలో లభిస్తాయి. కండరాలను, నరాలను సడలించి విశ్రాంతినిస్తాయి. మెలటోనిన్ (రాత్రివేళల్లో మెదడులో ఉత్పత్తి అయ్యే హార్మోన్) అధికంగా ఉండే ఆహారాలు.. చెర్రీలు, ఓట్స్, కివీ, అరటిపండ్లు. ఇవి నాణ్యమైన నిద్రకు తోడ్పడతాయి. పొటాషియం అధికంగా ఉండే టమాటా,చిలగడదుంపలు నిద్ర లయల్ని స్థిరీకరిస్తాయి.

### నిద్రాభంగం కలిగించేవి

రాత్రి కడుపునిండా తినటం, ఆలస్యంగా తినటం, వేపుళ్లు, కారాలు.. జీర్ణక్రియను ఆలస్యం చేస్తాయి. కలత నిద్రకు కారణం అవుతాయి. కెఫిన్, ఆల్కహాల్, చక్కెరలు మెలటోనిన్‌ను అణిచివేస్తాయి. నిద్రా భంగం కలిగిస్తాయి. నిమ్మజాతి పండ్లు లేదా అధిక ప్రొటీన్‌లు కలిగిన ఆహారాలు కూడా, బాగా పొద్దుపోయాక తింటే నిద్రకు ఆటంకం కలిగిస్తాయి.



RNI : APTEL/25/A0108
మహి న్యూస్ తెలుగు దినపత్రిక
జనరల్ న్యూస్
శనివారం - 01 - నవంబర్ - 2025

## పదవీ విరమణ పొందిన బంగారుపాలెం మండల తాసిల్దార్ బాబు రాజేంద్రప్రసాద్

38 సంవత్సరాల అనుభవంలో ఈరోజు ఒక తీపి జ్ఞాపకం.



చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం అక్టోబర్ 31.మహి న్యూస్, : చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండల



తాసిల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ 38 సంవత్సరాలు ప్రజలకు సేవలు అందించి శుక్రవారం తన మానవత్వాన్ని చాటుకున్నారు. తమకు కావలసిన బంధువులు మిత్రులు శ్రేయోభిలాషుల నడుమ శుక్రవారం సాయంత్రం 5:00 గంటలకు తన పదవి ముగియడంతో తాను పదవిలో ఉన్నంతవరకు రెవిన్యూ పరంగా అందరికీ మంచి చేశానని ఉద్దేశపూర్వకంగా తాను నమ్మినట్లు అందరికీ సేవ చేశానని ఉద్దేశంతో తాను ఎంతో ఆనందంగా 38 సంవత్సరాలు




జీవితం గడిచిపోయిందని తెలిపారు. తాను పదవి విరమణ పొందిన ఆనందంలో తన కుటుంబ సభ్యులతో పంచుకోవడం తనకెంతో ఆనందంగా ఉందని తెలిపారు. తమ సిబ్బందితో తాను ఒక కుటుంబ సభ్యునిగా ఉండే వారిని అందరి ఆదరాభిమానాలతో ఈ దినం వారి నుండి దూరం కావడం ఒక విధంగా బాధాకరంగా ఉందని, ఎంతటి వారైనా విశ్రాంతి సమయంలో విశ్రాంతి పొందక తప్పదని తెలియజేశారు. తన పదవి విరమణకు విచ్చేసిన తన రెవిన్యూ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి, పత్రిక సోదరులకు తన శ్రేయోభిలాషులకు మిత్రులకు బంధువులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

## తుంబకుప్పం పిహెచ్సి ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్




చిత్తూరు జిల్లా బంగారుపాలెం అక్టోబర్ 31.మహి న్యూస్,: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం తుంభకుప్పం పిహెచ్సి సెంటర్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు సిబ్బంది పనితీరుపై రోగులను విచారించి సంతృప్తి చెందారు. రోగులకు మందుల కొరత లేకుండా చూడాలని డాక్టర్ లోహిత్ కు తెలియపరిచారు. రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని తెలియపరిచారు. అన్ని రికార్డ్స్ ను హాజరు పట్టికలను అన్నింటిని తనిఖీ చేశారు. ఎమ్మెల్ హెచ్ పి, సి హెచ్ వో లు క్షేత్రస్థాయిలో పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని సూచించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఫ్రిడ్జ్, చిన్నపిల్లలకు ఉష్ణోగ్రత పెంచుటకు వాడే (వామర్) మిషన్, లేబర్ టేబుల్, మందులు ఉంచేందుకు ర్యాకర్ కలెక్టర్ నిధులనుంచి వెంటనే విడుదల చేస్తామని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, వైద్యాధికారి కె ఎస్ లోహిత్, డాక్టర్ సెల్వరాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు



పాండిచ్చేరి, యానం, మహి న్యూస్, అక్టోబర్ 31: యానాం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారతదేశ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 157 వ జయంతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



పుదుచ్చేరి పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యానాం ఎస్పి వరదరాజాన్ నేతృత్వంలో యానం ఎస్పీ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఫోటో ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. యానం ప్రాంతానికి చెందిన ఎన్.సి.సి తో పాటు పలు పాఠశాల చెందిన విద్యార్థులు ఈ ఫోటో ఎగ్జిబిషన్ తీలకించారం. ఈ ఫోటో ఎగ్జిబిషన్లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవిత చరిత్ర సంబంధించిన అంశాలతో కూడిన చిత్రపటాలను ప్రదర్శించారు. అనంతరం ఎస్పీ కార్యాలయ వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ అడలరసన్, ఎస్ఐలు పునీత్ రాజ్, కట్టా సుబ్బరాజు, తదితరు సిబ్బంది పాల్గొన్నారు.

## పశుసంవర్ధక శాఖలో ఆయన చేసిన సేవలు ప్రశంసనీయం

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి




కర్నూలు, మహి న్యూస్, అక్టోబర్ 31:- పశుసంవర్ధక శాఖలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి చేసిన సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు.. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి పదవీ విరమణ సందర్భంగా జిల్లా అధికారుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారికి సన్మానం చేశారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖలో అధికారిగా ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని, రైతులకు మరియు పాల ఉత్పత్తిదారులకు సాంకేతిక మార్గదర్శకత్వం అందిస్తూ వ్యవసాయ అనుబంధ రంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్నారు..ఆయన భవిష్యత్ జీవితంలో ఆరోగ్యం, ఆనందం చేకూరాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, సెట్కూర్ సి ఈ ఓ వేణుగోపాల్, డి సి హెచ్ ఎస్ జాఫ్రుల్లా, డి ఈ ఓ శామ్యూల్ పాల్, డి ఆర్ డి ఏ పిడి రమణ రెడ్డి తదితరులు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి చేసిన సేవలు కొనియాడారు.. కార్యక్రమంలో సి పి ఓ భారతి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, డి పి ఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




# వామ్మో... ఆ టీచర్ మాకొద్దు బాబోయ్..

## ఇంజరం గ్రామస్తుల ఆందోళన

కాకినాడ జిల్లా,తాళ్ళరేవు మండలం, మహి న్యూస్ ( అక్టోబర్31):ఏ ఊరిలోనైనా ఉపాధ్యాయుడు పాఠశాలకు వస్తున్నారంటే ఘనంగా స్వాగతం పలుకుతారు. అయితే ఇంజరం గ్రామంలో మాత్రం దానికి భిన్నంగా ఒక టీచర్ పాఠశాలకు కొత్తగా వస్తున్నారని తెలిసి గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ టీచర్ కారణంగా తమ పిల్లలు ఎక్కడ పాడైపోతారోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే తాళ్ళరేవు మండలం ఇంజరం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలకు ఇటీవల ఒక టీచర్ నియమితులయ్యారు. అయితే ఆ టీచర్ చరిత్ర తెలిసి స్థానిక నాయకులు గ్రామస్తులు ఆమె రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అక్టోబరు 9వ తేదీన బి. పద్మకళ్యాణి స్కూల్ అసిస్టెంట్ (హిందీ) అనే టీచర్ ఇంజరం పాఠశాలకు వస్తున్నట్లుగా సమాచారం వచ్చింది.




అయితే ఆ ఉపాధ్యాయురాలు పేరు వినగానే అటు ఉపాధ్యాయులతో పాటు ఇటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు కూడా అవాక్కయ్యారు. ఆమె గతంలో పనిచేసిన పలు పాఠశాలల్లో ప్రజల వ్యతిరేకతను చవిచూశారు. ఐ.పోలవరం మండలం మురముళ్ళ జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఆమె సరిగ్గా విధులు నిర్వహించలేదని తెలిసింది. అక్కడ స్కూలు విద్యా కమిటీ, గ్రామ పెద్దలు, ఆమె మీద యున్న అభియోగాలను చెబుతూ వ్రాతపూర్వకంగా ఆమెపై ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై అక్టోబర్ 4వ తేదీన డీఈవో కార్యాలయమునకు




ఎస్ఎంసి సభ్యులు, ఇంజరం గ్రామ పెద్దలు వెళ్ళి ఎట్టి పరిస్థితులలోను తమ పాఠశాలకు ఆ టీచర్ ను వేయవద్దని కోరారు. కాగా టీచర్ పద్మ కళ్యాణి ఈ నెల 9న ఇంజరం పాఠశాలకు మధ్యాహ్నం 2.00 గంటల సమయంలో వచ్చి అప్పటికే ఆమె ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పాఠశాలను, పాఠశాల పరిసరాలను, వీడియోలు తీసి, ఆడియోలు రికార్డింగ్ చేశారు. ఆమె వాడే పదజాలం సరిగా లేదని ఆమె తమతో మాట్లాడున్నప్పుడు ఇంజరం స్కూల్లో ఇకనుండి మీ పాఠశాలలో అబ్బాయిలు, అమ్మాయిలు కలిసితిరిగినా, స్కూలు ఆవరణలో అబ్బాయిలు అమ్మాయిలను ఏమి చేసినా నేను చూసీచూడనట్టు వుంటాను అని చెప్పడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఉపాధ్యాయిని ప్రవర్తన చూస్తే విద్యా వ్యవస్థకే కళంకము తెచ్చే విధంగా ఉందని, కులాల గురించి కూడా ఆమె నిందిస్తూ మాట్లాడిందని, ఆమె ఉపాధ్యాయ వృత్తి చేస్తున్నట్టు లేదని వాపోయారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆ ఉపాధ్యాయురాలిని తమ పాఠశాలలో చేర్చుకోలేమంటూ తీర్మాణం కూడా చేసి డీఈఓ కి అందజేశారు. అయినప్పటికీ మరోసారి ఆ ఉపాధ్యాయురాలని ఇంజరం పాఠశాలకు వేయడంపై గ్రామస్తులు శుక్రవారం పాఠశాలకు వచ్చిన డివైఈవో కెవివి సత్యనారాయణ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఆ ఉపాధ్యాయురాలిని తమ పాఠశాలలో వేస్తే తీవ్ర స్థాయిలో ఉద్యమం చేస్తామని ఎస్ఎంసి చైర్మన్ పెట్టా దేవి, సభ్యుడు కుమార్ గ్రామ సర్పంచ్ ముద్దన వెంకట శివరాం ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్ కుమారి, నాయకులు ఆకెల్ల నాగేశ్వరరావు, కాట్రు వీరపండు, కోరుకొండ చంటి, రేలంగి బాబీ, ఊడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అమర వీరుల త్యాగాలే దేశ సమగ్రతకు పునాది

## జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, మహి న్యూస్, అక్టోబర్ 31 : అమర వీరుల త్యాగాలు దేశ ఐకమత్యం, సమగ్రతకు పునాది అని, వారి స్ఫూర్తి యువతకు ప్రేరణగా నిలవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉద్ఘాటించారు. రాష్ట్రీయ ఏక్తా దివస్ అమర వీరుల వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించిన భారీ కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రత పరిరక్షణలో అమరవీరుల త్యాగాలు కీలకమని, ఈ స్ఫూర్తితో యువత దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమాజంలో పోలీసులు పాత్ర అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు.

### పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటాం: ఎస్పీ హామీ

జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన ఐక్యత మార్గం, అమర వీరుల త్యాగాలు దేశభక్తి వైపు నడిపిస్తున్నాయన్నారు. సమాజ భద్రత, దేశ ఐకమత్యం కాపాడడంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని, పోలీసు శాఖ ఎల్లప్పుడూ సామాజిక ఐక్యతకు కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే గోండు శంకర్ మాట్లాడుతూ, అమర వీరుల త్యాగాల స్ఫూర్తి ప్రతి ఒక్కరికి దేశభక్తి, కర్తవ్య నిబద్ధతను నేర్పుతుందని తెలిపారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు




### మౌనం పాటించి నివాళులు

పోలీస్ అమరవీరుల వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమైన శాంతియుత ఈ ర్యాలీ డే అండ్ నైట్ జంక్షన్ వరకు కొనసాగింది. ర్యాలీ ముగింపు సందర్భంగా పాల్గొన్న అధికారులు డే అండ్ నైట్ కూడలి వద్ద మానవ హారంగా ఏర్పడి, కొవ్వొత్తులతో అమర వీరుల స్మారకార్థంగా మౌనం పాటించి నివాళులు అర్పించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్, అదనపు ఎస్పీ కె.వి. రమణ, డీఎస్పీలు వివేకానంద, శేషాద్రి, సీఐలు, ఆర్ఐలు, పెద్ద ఎత్తున పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల సంస్మరణార్థం క్యాండిల్ ర్యాలీ

విజయనగరం, మహి న్యూస్, అక్టోబర్ 31 : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విజయనగరం పట్టణం మూడు లాంతర్లు జంక్షన్ నుండి కోట జంక్షను వరకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో "క్యాండల్ ర్యాలీ"ని అక్టోబరు 31న నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ ముఖ్య అతిధిగా హాజరై, "క్యాండిల్ ర్యాలీ"ని ప్రారంభించారు. పట్టణంలోని మూడు లాంతర్లు జంక్షను నుండి కోట జంక్షను వరకు నిర్వహించిన ర్యాలీలో పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొని, పోలీసు అమరవీరుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, పోలీసు అమరవీరులకు జోహార్లు అర్పించి, అమరవీరుల సంస్మరణ వారోత్సవాలకు ముగింపు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఐపిఎస్ మాట్లాడుతూ - పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఓపెన్ హౌస్, ర్యాలీలు, వ్యాస రచన, వక్తృత్వ పోటీలను, రక్తదాన శిబిరాలు, మెడికల్ క్యాంప్లు నిర్వహించామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విధులు నిర్వహిస్తూ అనేక మంది పోలీసులు తమ ప్రాణాలను సైతం కోల్పోయారన్నారు. ఉమ్మడి జిల్లాలో ఐదుగురు పోలీసు అధికారులు అంతర్గత భద్రతను పరిరక్షిస్తూ అమరులయ్యారని, వారు భౌతికంగా నేడు మన మధ్య లేకున్నా, ప్రజల గుండెల్లో జీవించే ఉన్నారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు/సిబ్బంది, పోలీసు పిల్లలు, స్కూలు/కళాశాల విద్యార్థులకు మూడు కేటగిరీలుగా విభజించి, వ్యాస రచన, వక్తృత్వ పోటీలను వేరు వేరుగా నిర్వహించి, విజేతలుగా నిలిచిన వారికి జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ప్రోత్సాహక నగదు బహుమతులను, ప్రశంసా




పత్రాలను త్వరలో అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, విజయనగరం ఇన్చార్జ్ డిఎస్పీ ఆర్.గోవిందరావు, విజయనగరం ఏఆర్ డిఎస్పీ ఈ. కోటిరెడ్డి, సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, టి.శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు, సూరినాయుడు, ఈ.నర్సింహమూర్తి, ఆర్ఐలు, ఆర్.రమేష్ కుమార్, శ్రీనివాసరావు, పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంత్రిగా అజహరుద్దీన్ ప్రమాణ స్వీకారం

**అజహరుద్దీన్‌తో ప్రమాణస్వీకారం చేయిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ. చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి**

### విమానాశ్రయం నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు సీఎం రేవంత్

హైదరాబాద్: మాజీ క్రికెటర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజహరుద్దీన్ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు. ఇంగ్లిష్ లో అల్లా సాక్షిగా అజహరుద్దీన్ ప్రమాణం చేశారు. ఉదయం 12:26 నిమిషాలకు ప్రారంభమైన ప్రమాణ స్వీకార కార్యక్రమం ఐదు నిమిషాల్లో ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ముంబై నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చి అక్కడి నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు వచ్చారు. అజారుద్దీన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతోపాటు సహచర మంత్రులు (కొండా సురేఖ, సీతక్క మినహా) హాజరయ్యారు. నూతన మంత్రిగా ప్రమాణం చేసిన అజహరుద్దీన్‌ను అభినందించారు. ప్రమాణ స్వీకార అనంతరం గవర్నర్‌తో కలిసి సీఎం, కేబినెట్ సహచరులు గ్రూప్ ఫొటో దిగారు.

### ఏ శాఖ ఇస్తారో..?

అజహరుద్దీన్‌కు ఏ శాఖ ఇస్తారన్నది రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ హయాంలో మైనారిటీలకు ఉప ముఖ్యమంత్రి హోదాలో హోం మంత్రిత్వ శాఖను కేటాయించిన నేపథ్యంలో అజహరుద్దీన్‌కు కూడా మంచి అవకాశం లభిస్తుందనే చర్చ జరుగుతోంది. ఆయనకు కూడా హోంశాఖ కేటాయిస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే, మైనారిటీ సంక్షేమంతోపాటు క్రీడాశాఖ అజారుద్దీన్‌కు కేటాయిస్తారని తెలుస్తోంది. శుక్రవారం సాయంత్రానికే అజహరుద్దీన్‌కు శాఖ కేటాయిస్తారని భావించినా వరంగల్ పర్యటన, జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో సీఎం రేవంత్ ఉన్న నేపథ్యంలో సాధ్యం కాలేదు. శనివారం అజహరుద్దీన్‌రీ మంత్రిత్వ శాఖపై స్పష్టత వస్తుందని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది.

### ఏ శాఖ ఇచ్చినా ఓకే: మంత్రి అజహరుద్దీన్

తనకు మంత్రిగా అవకాశం కల్పించినందుకు సంతోషంగా ఉందని, ఏ శాఖ ఇచ్చినా ఇబ్బంది లేదని రాష్ట్ర మంత్రి అజహరుద్దీన్ వ్యాఖ్యానించారు. మంత్రిగా ప్రమాణం చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, ముఖ్యమంత్రి, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనను మంత్రిగా చూసినందుకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సంతోషపడుతున్నారని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు సరైనవి కావన్నారు. తన గురించి గూగుల్‌ను అడిగితే తెలుస్తుందని, తన దేశభక్తి గురించి కిషన్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నికకు, తనకు మంత్రి పదవి ఇవ్వడానికి ఎలాంటి సంబంధం లేదని, తాను పార్టీ పట్ల నిబద్ధతతో ఉన్నందునే మంత్రి పదవి ఇచ్చారని చెప్పారు.

## కొత్తగా ప్రతిపాదించిన పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సూచనలు ఉంటే తెలియచేయండి

### జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి



కర్నూలు, మహి న్యూస్, అక్టోబర్ 31:- కొత్తగా ప్రతిపాదించిన పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సూచనలు ఉంటే తెలియచేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు.. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేషనైజేషన్ ఆఫ్ పోలింగ్ కేంద్రాలలో కొత్త పోలింగ్ కేంద్రాలు ఏమైనా ఉంటే ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు ఇదివరకే వచ్చాయన్నారు.. 1200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరించాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో కొత్తగా 240 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే 2203 పోలింగ్ స్టేషన్ లు ఉన్నాయన్నారు.. క్రొత్తగా ప్రతిపాదించిన పోలింగ్ స్టేషన్ ల ఏర్పాటుకి సంబంధించి ఏవైనా సూచనలు ఉంటే తెలియచేయాలని కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు... సమావేశంలో డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ , బహుజన సమాజ్ వాదీ పార్టీ తరపున డిస్ట్రిక్ట్ ఇంచార్జ్ అరుణ్ కుమార్, బిజెపి పార్టీ తరపున పి.టి.సాయి ప్రదీప్, నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున బజారన్న, తెలుగుదేశం పార్టీ తరపున ఎల్.వి. ప్రసాద్, మదన్ మోహన్, నాగేశ్వర రెడ్డి, రామకృష్ణ, వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ తరుపున పుల్లారెడ్డి, జనసేన పార్టీ తరపున తల్లా మంజునాథ్ ( డైరెక్టర్ , వాల్మీకి కార్పొరేషన్) , ఎన్నికల విభాగం సూపరిడెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు..

## డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కోసం బైక్ ర్యాలీ




కర్నూలు, మహి న్యూస్, అక్టోబర్ 31 : శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్థి మరియు కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ట్రాఫిక్ రూల్స్ మరియు డ్రంక్ అండ్ డ్రైవ్, మాదక ద్రవ్యాల నిర్మూలన పై అవగాహన బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీ కర్నూలు జిల్లా కోర్టు నందు గల న్యాయ సేవ సదన్ నుండి కొండారెడ్డి బురుజు వరకు కొనసాగింది.



జిల్లా జడ్జి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి వాహనం నడపాలని కోరారు, తాగి వాహనం నడపడం వలన యాక్సిడెంట్ కు గురైతే తాను మరణించడమే కాక మిగతా వారి జీవితాలను కూడా నాశనం చేసినట్లు అవుతుంది అని తెలిపారు. మాదక ద్రవ్యాలను తీసుకోవడం వలన జీవితాలు నాశనమవుతాయని తెలిపారు. ఇటీవల జరిగిన బస్సు ప్రమాదం లో ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి అని తెలిపారు. ప్రజలలో డ్రంక్ అండ్ డ్రైవ్ పై,ట్రాఫిక్ రూల్స్ పై, మాదక ద్రావ్యా ల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కలిగించడానికి ఈ బైక్ ర్యాలీ ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ర్యాలీ లో కర్నూలు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరినాథ్ చౌదరి, మొదటి అద నపు జిల్లా జడ్జ్ పి. కమలాదేవి, ఏడవ అదనపు జిల్లా జడ్జి వి. లక్ష్మీరాజ్యం, సిబిఐ కోర్టు జడ్జి ఎం.శోభారాణి, జూనియర్ సివిల్ జడ్జిలు సరోజినమ్మ, అనూష, కర్నూలు రీజినల్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ భరత్ చవాన్, కర్నూలు ఆర్టీసీ డిపో మేనేజర్ సుధారాణి, కర్నూల్ టౌన్ డిఎస్పి బాబు ప్రసాద్, కర్నూల్ టౌన్ ట్రాఫిక్ సిఐ మన్సు రుద్దీన్, దిశా సిఐ రామానాయుడు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, ప్యారా లీగల్ వాలంటర్స్ ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, మహి న్యూస్, అక్టోబర్ 31: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆదేశించారు.. శుక్రవారం ఉదయం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని వార్డుల్లో తిరిగి రోగులకు వైద్య సేవలు అందిస్తున్న తీరును పరిశీలించారు. క్యాజువాలిటీ, ఎమర్జెన్సీ, సూపర్ స్పెషాలిటీ బ్లాక్, న్యూరో సర్జరీ, రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్ యూనిట్, మానసిక రోగుల వార్డు, డెర్మటాలజిస్ట్ వార్డు, ఫిమేల్ ఆర్థో, మేల్ ఆర్థో తదితర వార్డ్ లను కలెక్టర్ పరిశీలించి రోగుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు.. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా క్యాజువాలిటీ వార్డు ను పరిశీలిస్తూ అక్కడే ట్రీట్మెంట్ తీసుకుంటున్న తిమ్మప్ప అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఎక్కడ నుండి వచ్చారు, ట్రీట్మెంట్ ఏ విధంగా ఇస్తున్నారని ఆరా తీశారు..వివరాలు తెలుసుకుని, అతనికి ఐ సి యు లో బెడ్ సిద్ధం చేయాలని కలెక్టర్ జి జి హెచ్ సూపరింటెండెంట్ ను ఆదేశించారు... అనంతరం అక్కడే ఉన్న ఇతర రోగులతో మాట్లాడుతూ వైద్యులు అందుబాటులో ఉంటున్నారా? ట్రీట్మెంట్ ఏ విధంగా ఇస్తున్నారు? సరైన సమయానికి మందులు ఇస్తున్నారా? భోజనం ఏ విధంగా ఉంది అని కలెక్టర్ పేషెంట్ లను అడిగి తెలుసుకున్నారు... 39 ఏళ్ల వయస్సు ఉన్న రహీమ్ అనే పేషెంట్ కేస్ షీట్ ను కలెక్టర్ పరిశీలిస్తూ, ట్రీట్మెంట్ ఏ విధంగా ఇస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్ యూనిట్ ను పరిశీలిస్తూ ఇటీవల బస్సు ప్రమాదానికి గురైె ట్రీట్మెంట్ తీసుకుంటున్న గుణ సాయి అనే వ్యక్తితో మాట్లాడారు. ఆరోగ్యం ఎలా ఉంది? వైద్యులు అందుబాటులో ఉంటున్నారా? ట్రీట్మెంట్ ఏ విధంగా ఇస్తున్నారు అని ఆరా తీశారు. వైద్యులతో కూడా మాట్లాడారు.. గుణ సాయి ఆరోగ్యం మెరుగయిందని వైద్యులు తెలిపారు. సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ను పరిశీలిస్తూ, గుండె సంబంధిత వైద్యం తీసుకుంటున్న దేవదానం కుటుంబ సభ్యులతో మాట్లాడారు..రోగుల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.. అనంతరం ఫిమేల్ ఆర్థో, మేల్ ఆర్థో వార్డులను పరిశీలించారు. న్యూరో సర్జరీ వార్డు లో ట్రీట్మెంట్ తీసుకుంటున్న 14 ఏళ్ల వయస్సు ఉన్న ప్రకాష్ తో కలెక్టర్ మాట్లాడారు..అన్ని వార్డులలో రోగులతో మాట్లాడారు.. ఆరోగ్యం ఎలా ఉంది? ట్రీట్మెంట్ ఏ విధంగా ఇస్తున్నారు ?? సరైన సమయానికి మందులు ఇస్తున్నారా?? భోజనం ఏ విధంగా ఉంది అని కలెక్టర్ పేషెంట్ లను అడిగి తెలుసుకున్నారు... వైద్యాధికారులతో మాట్లాడుతూ, ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సిబ్బంది సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు..వార్డులు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.. జిల్లాలో లెప్రసీ (కుష్టు వ్యాధి) నిర్మూలన దిశగా ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని కలెక్టర్ లెప్రసీ అధికారిని ఆదేశించారు.. .. హాస్పిటల్ ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచాలని, హైజీన్ పాటించాలని, నీరు, విద్యుత్, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. న్యూరో సర్జరీ, యూరాలజీ ఆపరేషన్ థియేటర్ లను డిసెంబర్ నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏపిఎంఎస్ఐడిసి ఇంజనీర్ లను ఆదేశించారు.. కలెక్టర్ వెంట జి జి హెచ్ సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు, ఇంచార్జి డి ఎం హెచ్ ఓ డా.భాస్కర్, జి హెచ్ ఏఓ సింధు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ ల ద్వారా రుచికరమైన భోజనాన్ని అందించండి



కర్నూలు, మహి న్యూస్, అక్టోబర్, 31: ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ ల ద్వారా రుచికరమైన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోని అన్న క్యాంటీన్ను జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనం చేస్తున్న ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. భోజనం నాణ్యత, రుచి, పరిమాణం, సర్వింగ్ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. గత వారం భోజనం కొంచెం కారంగా ఉండాలని ప్రజలు సూచించడంతో, ఆ మేరకు భోజనం అందించేందుకు చర్యలు తీసుకున్నామని, ఇప్పుడు రుచిలో మార్పు వచ్చిందా అని ప్రశ్నించారు. ప్రజలు సానుకూలంగా స్పందించి, భోజనం రుచికరంగా ఉంది, నాణ్యత బాగుంది అని తెలిపారు. భోజనం తక్కువ కాకుండా ప్రతి ఒక్కరికీ సరిపడే విధంగా అందించాలని కలెక్టర్ సూచించారు. రోజుకు ఎన్ని టోకెన్లు ఇస్తున్నారని కలెక్టర్ ఆరా తీశారు. మధ్యాహ్నం సుమారు 650 టోకెన్లు అందిస్తున్నట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి టోకెన్ల సంఖ్యను పెంచే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. అలాగే పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, భోజన ప్రాంగణం పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు.

## భరత్ రామ్ అసత్య ప్రచారం చేస్తున్నాడు... చర్యలు తీసుకోండి



రాజమహేంద్రవరం, మహి న్యూస్, అక్టోబర్ 31 : రాజ్యాంగబద్ధంగా... ప్రజలచే అత్యధిక మెజార్టీతో ఎన్నుకోబడిన రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్పై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక త్రీ టౌన్ పోలీసు స్టేషన్లో రాజమహేంద్రవరం తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కమిటీ సభ్యులు, లీగల్ సెల్ విభాగం, వివిధ డివిజన్ల కమిటీల సభ్యులు ఫిర్యాదు చేశారు. అనంతరం నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు చాపల చిన్నరాజు, లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచపల్లి ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మీద మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అనుచితమైనటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వ్యక్తిగత ప్రతిష్టను, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేలా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ నిరాధారణమైన నిందారోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. భరత్ రామ్ సదరు ఆరోపణలను వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్స్టా గ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్నారని వివరించారు. హిందూపురం ఎమ్మెల్యే ప్రముఖ సినీ నటులు నందమూరి బాలకృష్ణ విగ్గు పెట్టుకుని స్టైల్ గా కళ్ళజోడు పెట్టుకుని మద్యం సేవించి అసెంబ్లీ సమావేశంలో పాల్గొన్నారంటూ ఆయన మీద లేనిపోని అభాండాలు వేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమాధానం చెప్తూ జగన్ పెగ్గు పోశారని ఒప్పుకుంటే బాలయ్యబాబు మద్యం వేసించారని తాము ఒప్పుకుంటామని మాత్రమే సమాధానం చెప్పారని, అయితే జగన్ పోసాడా అనే మాటలను కట్ చేసి తాగి వచ్చారు అనే మాటలతో సోషల్ మీడియాలో ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా పలుసార్లు ఈవిఎం ఎమ్మెల్యే అని మాటిమాటికి అదే పదాన్ని ఉచ్చరిస్తూ ఆయన్ను అప్రతిష్ట పాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా ప్రతినిధులు ఎవరైనా ఎన్నికల సంఘం ద్వారానే శాసన సభ్యులు కానీ, పార్లమెంట్ సభ్యులు గాని ఎన్నుకోబడుతున్నారని, అటువంటి వ్యవస్థను కూడా అపఖ్యాతి పాలు చేస్తూ ఎన్నికల సంఘం వ్యవస్థను కూడా మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అప్రతిష్ట పాలు చేసి రాష్ట్ర ప్రజలకు తప్పుడు సంకేతాలని పంపిస్తున్నారని మండిమడ్డారు. అంతేకాకుండా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అధికారిక, వ్యక్తిగత పని మీద ఢల్లీ వెళితే ప్రత్యేక విమానంలో దోచుకున్న సొమ్ముతో వెళ్లి షికారులు చేస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఏ విధమైనటువంటి ఆధారం లేకుండా ఇటువంటి నిందారోపణలు చేస్తూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీయడమే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా మీద కూడా భరత్ రామ్ తప్పుడు ప్రచారం చేస్తూ కేంద్ర, రాష్ట్రాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా రెచ్చగొట్టే ధోరణిలో భరత్ రామ్ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. వ్యవస్థలు, వ్యక్తులపై ఇటువంటి అసత్య ప్రచారాలు చేస్తున్న మాజీ ఎంపీ భరత్ రామ్ మీద తగు చర్యలు తీసుకోవాలని కోరారు. నగర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మామిడి శ్రీను, ఉపాధ్యక్షులు బూరా రమణ, ఉడమల నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు చెన్నా వెంకటరమణ, కారంగి వీర్రాజు, బత్తిన రవి కుమార్, కార్యదర్శులు కొమరం సురేష్, పెద్ద, వివిధ డివిజన్ ఇన్ఛార్జులు దుత్తరపు గంగాధర్, కానేటి ప్రభుదాస్, లీగల్ సెల్ నగర అధ్యక్షులు కొమ్మర్తి బాబ్జి, లీగల్ సెల్ ఉపాధ్యక్షులు నూకల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పూడి నవీన్, సభ్యులు సీహెచ్జి కిషోర్, ఈ సత్యం, నాయకులు కవులూరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ అనంతరం పంట నష్టం తగ్గింపుపై జేడీలతో టెలికాన్ఫరెన్స్

అమరావతి, మహి న్యూస్, అక్టోబర్ 31: మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వరి పంటలకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో, పంట రక్షణ చర్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు జాయింట్ డైరెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతుల కష్టానికి ప్రతిఫలం లభించేలా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్న తెలిపారు. పంట నష్టం తగ్గించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ, హార్టికల్చర్, గ్రౌండ్ వాటర్ మరియు మెట్రోలాజికల్ అధికారులతో సమన్వయం కలిగి పనిచేయాలని సూచించారు. ప్రతి మండల వ్యవసాయాధికారి స్థాయిలో పంట నష్టం అంచనాలు ఖచ్చితంగా సేకరించి, రైతులకు తక్షణ ఉపశమనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో శాస్త్రవేత్తల సహాయంతో పంట రక్షణ పద్ధతులు అమలు చేయాలని సూచించారు. రైతుల సమస్యలు, నష్టాలపై అధికారుల నుంచి సమగ్ర నివేదిక అందించాలని, వాటిని త్వరగా ప్రభుత్వానికి సమర్పించి సాయం అందించే దిశగా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతు భవిష్యత్తు మనకు ప్రాధాన్యం. ప్రతి ధాన్యపు గింజ విలువైనది. రైతుకు నష్టం రాకుండా ప్రతి అధికారి నిబద్ధతతో వ్యవహరించాలి అని పేర్కొన్నారు. గురువారం క్రిష్ణా జిల్లాలో పంట ముంపు ప్రాంతాలు పర్యటించినప్పుడు రైతులు తమ పంట నష్టం క్రింద నమోదు చేసుకుంటే ఆ భూమిపై పండిన వరి అమ్ముకోడానికి అవ్వదు అని రైతులు నాతో చెప్పుకున్నారని, వ్యవసాయశాఖ మరియు సివిల్ సప్లయి డిపార్ట్మెంట్ వాళ్లతో మాట్లాడటం జరిగింది. వారకి పూర్తి సూచనలు (ఇన్ స్ట్రక్షన్స్) ఇవ్వడం జరిగింది. గతంలో ఎస్డిఆర్ఎఫ్



రిలీఫ్ కింద పరిహారం తీసుకున్న వారు అందరికీ ఈ ఇబ్బంది వచ్చింది. కావున ఈ సారి ఆ ఇబ్బంది రాకుండా ఇరు శాఖలకు సూచనలు ఇవ్వడం జరిగిందని మంత్రి తెలియజేశారు.

### వరి పంటకు నష్టాన్ని తగ్గించుకోవడానికి రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి

మొంథా తుఫాను కారణంగా కృష్ణ, గోదావరి, డెల్టా జిల్లాల్లో వరి పంట పూత దశ, పాలు పోసుకునే దశ మరియు కోత దశల్లో ఉండగా భారీ ఈదురుగాలులు, వర్షాల ప్రభావంతో అనేక వరి చేలు పడిపోయి నీట మునిగిన నేపథ్యంలో, నష్టం తీవ్రత తగ్గించేందుకు రైతులు అత్యవసరంగా కొన్ని కీలక చర్యలు తీసుకోవాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. పూత దశ నుంచి పాలు పోసుకునే దశ వరకు పొలాల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే అంతర్గత కాలువల ద్వారా తొలగించడం అత్యంత ముఖ్యం. నీరు తగ్గిన వెంటనే ఎకరాకు 400 మి.లీ హెక్సాకోనాజోల్ లేదా 200 మి.లీ ప్రోపికోనాజోల్ పిచికారీ చేయడం ద్వారా మాగుడు తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుందని సూచించారు. పరిస్థితులు అనుకూలిస్తే పడిపోయిన చేలను పైకి లేపి కట్టుకోవాలి. అలాగే నిలబడి ఉన్నా, పడిపోయినా గింజలు రంగు మారకుండా, మాగుడు మరియు మానిపండు తెగులు వ్యాప్తి చెందకుండా ఎకరాకు 200 మి.లీ ప్రోపికోనాజోల్ తప్పనిసరిగా పిచికారీ చేయాలి. పాలు పోసుకునే దశలో ఉన్న పంటలకు కూడా ఇదే విధంగా నీటిని కాలువల ద్వారా తొలగించి చేలను పైకి లేపడం కీలకం. గింజ గట్టిపడే దశ మరియు కోత దశలో చేలు నీట మునిగితే వెంటనే నీటిని బయటకు పంపాలి. కోత దశలో కంకిలో మొలకలు కనిపిస్తే, నీరు బయటకు తీసిన తర్వాత 5% ఉప్పు ద్రావణం (లీటరు నీటికి 50 గ్రా ఉప్పు) పిచికారీ చేయడం ద్వారా మొలక పడటం, రంగు మారడాన్ని తగ్గించవచ్చు. గింజ గట్టిపడే దశలో కూడా చేలను పైకిలేపి కట్టుకోవడం, నీటిని వేగంగా తొలగించడం తప్పనిసరి. ఇప్పటికే కోసి కుప్పలుగా ఉన్న ధాన్యాన్ని వర్షం నుండి రక్షించేందుకు బరకాలు కప్పాలి. రెండు మూడు రోజులు ఎండబెట్టే అవకాశం లేకపోతే, కుప్పల్లో మొలక రాకుండా, రంగు మారకుండా ప్రతి క్వింటాకు 1 కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలపడం ద్వారా రక్షణ పొందవచ్చని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

## జాతీయ సమైక్య సారధిగా భారతదేశ చరిత్రలో సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ స్థానం చిరస్మరణీయం

### జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్

కర్నూలు, మహి న్యూస్, అక్టోబర్ 31: జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్కూరు ఆధ్వర్యంలో సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ జయంతి ని పురస్కరించుకొని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో వల్లభ్ భాయ్ పటేల్ చిత్రపటానికి కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ మరియు జిల్లా అధికారులు పూలమాల వేసి నివాళులు అర్పించారు.. అధికారులతో కలిసి జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేశారు.కేంద్ర ప్రభుత్వ సంస్థ 'మై భారత్ సెంటర్' ఆధ్వర్యంలో నిర్వహించబోయే సర్దార్ 150 యూనిటీ మార్చ్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ పాలన దక్షత, నీతి నిజాయితీ, దృఢసంకల్పం, వాస్తవ దృక్పథం, భవిష్యత్తు పట్ల దూరదృష్టి గలవారని, %ళి%ప్రధాన మంత్రి మోడీ, పటేల్ సేవల బావి తరాలకు తెలిసే విధంగా పటేల్ జన్మస్థలమైన గుజరాత్లో ప్రపంచంలోనే ఎత్తైన పటేల్ విగ్రహాన్ని జాతీయ సమైక్యతకు చిహ్నంగా "స్టాట్యూ ఆఫ్ యూనిటీ" పేరుతో నిర్మించారని తెలిపారు. మనమందరం పటేల్ భావాలు, ఆదర్శాలను పాటించి జాతీయ సమైక్యతను పటిష్టపర్చడమే మనం పటేల్ ఇచ్చే నిజమైన జయంతి కానుక అని తెలిపారు . జాతి సమైక్య సారధిగా, నవభారత వారధిగా భారతదేశ చరిత్రలో పటేల్ స్థానం చిరస్మరణీయం అన్నారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం తరువాత సంస్థానాలను భారత యూనియన్లో విలీనం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పాలనలో ఏకరూపతను, దేశ సమైక్యతను సాధించాలనే సంకల్పంతో అఖిల భారత సర్వీసులను ఏర్పాటు చేశారని . పటేల్ కృషి ఫలితమే నేటి ఈ అఖిల భారత సర్వీసుల వ్యవస్థని, అందుకే పటేల్ను "అఖిల భారత సివిల్ సర్వీసుల పితామహుడు" గా అభివర్ణిస్తారని తెలిపారు.. సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న జాతీయ సమైక్యతా దినోత్సవంగా జరుపుకుంటామని, సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ 150 జయంతిని పురస్కరించుకొని అత్మ నిర్భర్ స్ఫూర్తిని ప్రతిబించే విధంగా ఆన్ లైన్ ద్వారా యువత కు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారని, అలాగే అక్టోబర్ 31 నుంచి నవంబర్ 25 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ 'మై భారత్ సెంటర్' ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పాదయాత్రలు సర్దార్ 150 యూనిటీ మార్చ్ పేరున నిర్వహిస్తారని తెలిపారు. యువ మోర్చా నాయకులు సునీల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయి సర్దార్ 150 యూనిటీ మార్చ్ (పాదయాత్ర) నవంబరు 25 లోపు పూర్తి అవుతాయని, జాతీయ స్థాయి సర్దార్ 150 యూనిటీ మార్చ్ (పాదయాత్ర) నవంబరు 25 నుండి డిసెంబర్ 6 వ తేదీ వరకు సర్దార్ పటేల్ జన్మస్థలం కర్మసద్ నుంచి ఏక్తా నగర్ (ఐక్యతా విగ్రహం) వరకు 150 కి.మీ పాదయాత్ర నిర్వహించబడుతుందని తెలిపారు. సర్దార్ 150 యూనిటీ మార్చ్ (పాదయాత్ర) ప్రతి నియోజక వర్గంలో కూడా నిర్వహిస్తున్నామని, జిల్లా స్థాయి మరియు రాష్ట్ర స్థాయిలో సర్దార్ 150 యూనిటీ మార్చ్ (పాదయాత్ర) లో యువతను భాగస్వామ్యం చేసే లక్ష్యం తో ప్రతి నియోజక వర్గం నుంచి యువకులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, మై భారత్ సెంటర్ జిల్లా యువజన అధికారి రాహుల్ రెడ్డి, సీపీఓ భారతి మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నియోజక వర్గ, మండల స్పెషల్ ఆఫీసర్లు ప్రతి వారం తప్పనిసరిగా మండలాలకు వెళ్ళాలి

### జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు, మహి న్యూస్, అక్టోబర్ 31: నియోజక వర్గ, మండల స్పెషల్ ఆఫీసర్లు ప్రతి వారం తప్పనిసరిగా మండలాలకు వెళ్ళాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో 3 రోజుల పాటు 91 శాఖల అధికారులతో ఇంటరాక్టివ్ సెషన్ కార్యక్రమాన్ని నిర్వహించడంలో భాగంగా శుక్ర వారం పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ, ఎనర్జీ, నెడ్ క్యాప్, హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్స్టైల్స్, మైన్స్ అండ్ జియాలజీ, సంక్షేమ శాఖలు, మున్సిపాలిటీలు,పబ్లిక్ హెల్త్ తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ ఇంటరాక్టివ్ సెషన్ కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియోజక వర్గ, మండల స్పెషల్ ఆఫీసర్లు కేటాయించిన మండలాలకు ప్రతి వారం తప్పనిసరిగా వెళ్లి, ఆస్పత్రులు, పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్వాడీ సెంటర్లు, సచివాలయాలను తనిఖీ చేయాలన్నారు.ఆస్పత్రుల్లో ప్రజలకు వైద్యసేవలు అందుతున్న తీరు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, విద్యాబోధన, హాస్టళ్లలో పిల్లలకు కల్పిస్తున్న వసతుల పరిస్థితి, అంగన్వాడీ ల్లో పౌష్టికాహారం, సచివాలయాల్లో సేవలు అందిస్తున్న తీరు, వ్యవసాయ,ఉద్యాన శాఖలకు సంబంధించి పంటల పరిస్థితి,మైక్రో ఇరిగేషన్ అమలు, రైతులకు అనుబంధ ఆదాయంగా గొర్రెలు, మేకల యూనిట్లు మంజూరు తదితర అంశాలను పరిశీలించి సంబంధిత వర్గాల వారికి అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో అక్షరాస్యత పెంచే విధంగా కూడా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆయా మండలాల్లో ఉన్న సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి తగిన ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు.. సంక్షేమ హాస్టళ్లకు 15 రోజులకు ఒకసారి ఏ ఎన్ ఎం లతో పాటు డాక్టర్ ను కూడా పంపాలని కలెక్టర్ డీఎంహెచ్ఓ ను ఆదేశించారు. హాస్టల్ లలో తాగునీరు, నాణ్యమైన భోజనం, విద్యా బోధన, టాయిలెట్ ల నిర్మాణం ముఖ్యమైన అంశాలని, వీటిపై ప్రత్యేక దృష్టి ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రూరల్ లో ఉన్న హాస్టల్ లలో స్వచ్ఛ భారత్ మిషన్ కింద టాయిలెట్ ల నిర్మాణానికి ఆర్ డబ్ల్యూఎస్, అర్బన్ లో ఉన్న హాస్టళ్లకు మున్సిపల్ కమిషనర్ లకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. బిసి హాస్టళ్లలో రూ.89 లక్షలతో చేపడుతున్న మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని apewidc అధికారులను ఆదేశించారు. హాస్టళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని apewidc అధికారులను




ఆదేశించారు. ఆస్పత్రులు, హాస్టళ్లలో సెప్టిక్ ట్యాంకు లను క్లీన్ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే హాస్టళ్లలో మూడు నెలలకు ఒకసారి ముళ్ళ పొదలు, పిచ్చి చెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని డిపివో,మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమ హాస్టళ్లలో పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం బాగుందని, అదే విధంగా బిసి హాస్టళ్లలో కూడా పదవతరగతి లో ఉత్తీర్ణతా శాతం పెరగాలని శాతాన్ని పెంచాలని కలెక్టర్ బిసి వెల్ఫేర్ అధికారిని ఆదేశించారు. వైద్య ఆరోగ్యం, విద్య, సంక్షేమ హాస్టళ్లు, మహిళా శిశు సంక్షేమ శాఖ, శానిటేషన్ ల సమస్యలు, ఫీడ్ బ్యాక్ కోసం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 4299 ను హాస్టళ్లలో ప్రదర్శించాలని కలెక్టర్ సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, సిపిఓ భారతి, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఇతర జిల్లా అధికారులు,మునిసిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు..

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

## ఏపీ ఎస్ బి సి ఎల్, ఐ ఎం ఎఫ్ ఎల్ డిపోను తనిఖీ చేసిన జెసి



నంద్యాల, మహి న్యూస్, అక్టోబర్ 31: జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఏపీ ఎస్ బి సి ఎల్ మరియు ఐ ఎం ఎఫ్ ఎల్ డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్... డిపోలో ఉన్న ఐ ఎం ఎఫ్ ఎల్ మరియు బీర్ స్టాక్ యొక్క ప్లాట్లను క్షుణ్ణంగా పరిశీలించి స్టాక్ యొక్క ఓపెనింగ్ బ్యాలెన్స్ చెక్ చేయడం జరిగింది. డిపో లో ఉన్న రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే డిపో సేల్స్, ఏపీ సురక్ష యాప్, గురించి డిపో మేనేజర్ నాగేష్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిపో పరిసరాలను కలియతిరిగి ఐ ఎం ఎల్ మరియు బీర్ లోడింగ్ అన్ లోడింగ్ కేసులకు సంబంధించి అక్కడి సిబ్బందికి పలు అంశాలు తెలియజేసి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపర్వైజర్ కోటిరెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది, డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఐక్యతకు పునాది వేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్



ఒంగోలు, మహి న్యూస్, అక్టోబర్ 31 : భారత దేశపు ఉక్కమనిషి, దేశాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి, జాతీయ ఐక్యతకు పునాది వేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ఒంగోలు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, సెట్నల్ సిఈఓ శ్రీమన్నారాయణ, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను దాటికి దెబ్బతిన్న రోడ్లు, వాటి పునర్నిర్మాణానికి అయ్యే వ్యయంపై సమగ్ర నివేదిక రూపొందించండి




తూర్పు నాయుడుపాలెం/ప్రకాశం జిల్లా, మహి న్యూస్, అక్టోబర్ 31 : తుఫాను దాటికి కొండపి నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లు, వాటి పునర్నిర్మాణానికి అయ్యే ఖర్చుపై సమగ్ర నివేదిక రూపొందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సంబందిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాడు టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ అధికారులతో మంత్రి డీ.బీ.వి స్వామి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ....మొంథా తుఫాన్ కారణంగా నియోజకవర్గంలో పాడైపోయిన సిసి రోడ్లు, బీటీ రోడ్లు, ఇతర రోడ్ల వివరాలు సేకరించి వాటి పునర్నిర్మాణానికి అయ్యే ఖర్చుపై సమగ్ర నివేదిక అందించాలన్నారు. పూర్తిగా దెబ్బతిన్న కల్వర్టుల స్థానంలో కొత్త వాటి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. పొలాలకు వెళ్లే డొంక రోడ్లు కూడా ఎంత మేర పాడయ్యాయో వివరాలు సేకరించి త్వరితగతిన నివేదిక అందజేయాలని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అధికారుల్ని ఆదేశించారు.

## తుఫాన్ కారణంగా పంట నష్ట పోయిన ప్రతి ఒక్క రైతును ఆదుకోవడం జరుగుతుంది

ఒంగోలు, మహి న్యూస్, అక్టోబర్ 31 : మొంథా తుఫాన్ కారణంగా పంట దెబ్బతిని నష్ట పోయిన ప్రతి ఒక్క రైతును ఆదుకోవడం జరుగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శుక్రవారం ఉదయం కొండపి నియోజకవర్గం మర్రిపూడి మండల పరిధిలోని అంకేపల్లి, రాజుపాలెం గ్రామాల్లో మొంథా తుఫాన్ నేపథ్యంలో దెబ్బతిన్న సజ్జ పంటను పరిశీలించి, అధికారులు, రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, ప్రకాశం జిల్లాలో ఎన్నడూ లేని విధంగా మొంథా తుఫాన్ తో విపరీతంగా వర్షాలు కురవడంతో జిల్లాలో సాగు చేసిన 2,300 హెక్టార్లలోని సజ్జ, మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, మిరప, వరి, పెసర, పొగాకు పంటలకి నష్టం వాటిల్లిందని తెలిపారు. నష్టపోయిన రైతుల వివరాలను సమగ్రంగా సేకరించి నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవటం జరుగుతుందన్నారు. తుఫాన్ కారణంగా పాడైపోయిన రోడ్ల పునర్నిర్మాణ అంచనాలు వేస్తున్నట్లు తెలిపారు. అంచనాలు పూర్తయిన వెంటనే రోడ్లను పునర్నిమిస్తామన్నారు. తుఫాన్ సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడడంలో జిల్లా కలెక్టర్ నుంచి గ్రామ సచివాలయ ఉద్యోగుల వరకు అందరి సేవలు అభినందనీయమన్నారు. పారిశుధ్య కార్మికులు తుఫాన్ విపత్కర పరిస్థితిలో కూడా వారి విధి నిర్వహణలో శక్తివంచన లేకుండా పనిచేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణ, ఆర్.టి.జి.ఎస్ నిర్వహణ మూలంగానే విపత్తును సమర్థవంతంగా ఎదుర్కోగలిగామని మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులను టెలి కాన్ఫరెన్స్ ద్వారా అప్రమత్తం చేస్తూ అధికారులతో ప్రజలకు సహాయక చర్యలలో అందుబాటులో ఉంచారన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి నిత్యవసర వస్తువులు సరఫరా చేసి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. మంత్రి వెంట కనిగిరి ఆర్డిఓ కేశవర్ధన్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు రేషన్ పంపిణీకి శ్రీకారం



గార, మహి న్యూస్, అక్టోబరు 31: మోంతా తుఫాన్ ప్రభావం వల్ల నష్టపోయిన మత్స్యకార, ఇతర కుటుంబాలకు కూటమి ప్రభుత్వం తక్షణ సహాయం నిమిత్తం నిత్యవసర సరుకులను అందిస్తోందని విపత్తుల సమయంలో సహాయక చర్యలకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గోండు శంకర్ తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రేషన్ పంపిణీకి శుక్రవారం ఆయన శ్రీకారం చుట్టారు. గార మండలం బందరువానిపేట, కే. మత్స్యలేసం, కళింగపట్నం పంచాయతీలలోని మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల చొప్పున రేషన్ బియ్యాన్ని ఎమ్మెల్యే అందజేశారు. అంతేకాకుండా, మత్స్యకారులకు కేజీ చొప్పున ఆయిల్, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, పంచదార వంటి నిత్యవసర సరుకులను కూడా త్వరలో అందజేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని అర్హులైన అందరికీ అందేలా చూడాలని స్థానిక తాసిల్దార్, మండల అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే గార పంచాయతీలోని సిలగాం గ్రామంలో తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటలను శంకర్ స్వయంగా పరిశీలించారు.

# భరత జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలి..!

### డిఆర్వో విశ్వేశ్వర నాయుడు ఘనంగా "ఏక్తా దివస్" సర్ధార్ వల్లభాయి పటేల్ 150 వ జయంతి వేడుకలు






వైయస్సార్ కడప జిల్లా, మహి న్యూస్ అక్టోబర్ 31 : భిన్నత్వంలో ఏకత్వం, సమైక్యత, సౌభ్రాతృత్వాలకు ప్రతీకగా వెలుగొందుతున్న.. మన భరత జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని పిలుపునిస్తూ.. అదే "ఏక్తా దివస్" ముఖ్య ఉద్దేశ్యమని



డిఆర్వో విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయి పటేల్ 150 వ జయంతిని పురస్కరించుకుని.. శుక్రవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ లో.. రాష్ట్రీయ "ఏక్తా దివస్" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా...డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, కలెక్టరేట్ అధికారులతో కలిసి సర్ధార్ వల్లభాయి పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్వో విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ.. భారతదేశపు "ఉక్కు మనిషి"గా ప్రపంచ దేశాలకు స్ఫూర్తిని ఇచ్చిన.. సర్దార్ వల్లభ్ భాయి పటేల్ జయంతి రోజును.. భారత ప్రభుత్వం "ఏక్తా దివస్" గా పరిగణించి ఆయనను స్మరించుకోవడం అభినందనీయం అన్నారు. 1875, అక్టోబరు 31న గుజరాత్‌లోని నాడియార్‌లో జవేరిభాయ్, లాడ్ భాయి దంపతులకు జన్మించిన సర్దార్.. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడిగానే కాకుండా.. స్వాతంత్ర్యానంతరం సంస్థానాలు భారతదేశములో విలీనం కావడానికి గట్టి కృషిచేశారన్నారు.



ఇంగ్లాండులో బారిష్టరు పట్టా పుచ్చుకొని స్వదేశానికి తిరిగివచ్చి దేశంలో జరుగుతున్న జాతీయోద్యమానికి ఆకర్షితుడైన సర్దార్.. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా మహాత్మా గాంధీ నేతృత్వంలో కొనసాగిన స్వాతంత్ర్యోద్యమంలో పాలుపంచుకున్నారన్నారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమంలోనే కాకుండా దేశప్రజల సంక్షేమం కోసం సర్దార్ అనేక సాంఘిక ఉద్యమాలను చేపట్టారన్నారు. 1931లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షత వహించడంతో పాటు.. భారత రాజ్యాంగ రచనలో ప్రముఖ పాత్ర వహించారని, అందులో.. అతిముఖ్యమైన ప్రాథమిక హక్కుల కమిటీకి చైర్మెన్‌గా కూడా వ్యవహరించారన్నారు. స్వాతంత్ర్యానంతరం జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వంలోని కేంద్రమంత్రి మండలిలో హోంశాఖ మంత్రి గానూ, ఉప ప్రధానమంత్రి గానూ బాధ్యతలను నిర్వహించారని.. ఆయన సేవలు యావత్ ప్రపంచానికే స్ఫూర్తినిచ్చాయన్నారు. భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిని ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేలా.. గుజరాత్‌లోని నర్మదా నదీ తీరంలోని సాధు బెట్ అనే చిన్న దీవిలో.. 2018 అక్టోబరు 31న ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఆయన విగ్రహాన్ని భారత ప్రభుత్వం ఆవిష్కరించిందన్నారు. ఈ విగ్రహానికి 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' (ఏకత్వ చిహ్నము) అని నామకరణం చేశారన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ యావత్ ప్రపంచానికే స్ఫూర్తిదాయకం అన్నారు. కార్యక్రమంలో ముందుగా.. "దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమవుతానని, అంతేగాక ఈ సందేశాన్ని తోటివారందరిలో విస్తరింపచేయడానికి గట్టిగా కృషిచేస్తానని" సభకు హాజరైన వారందరి చేత డిఆర్ఓ ప్రతిజ్ఞ



చేయించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి స్టెప్ సీఈవో విజయ్ కుమార్ మెప్మా పిడి కిరణ్ కుమార్, కలెక్టరేట్ లోని సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

**జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి**
**జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి) సమీక్ష సమావేశం**
**24 ఎస్సీ,ఎస్టీ ట్రాన్స్పోర్ట్ వాహనాలకు రూ. 2.75 కోట్ల మేర రాయితీలు మంజూరు.**
**పరిశ్రమలకు వివిధ రాయితీల కింద రూ 67.62 లక్షల మేర రాయితీలు మంజూరు**
**ఉద్యం రిజిస్ట్రేషన్ లపై అవగాహన వర్క్ షాప్ లు**
**పెండింగ్ అప్లికేషన్లను త్వరితగతిన పూర్తిచేయండి**





వైఎస్ఆర్ కడప జిల్లా, మహి న్యూస్ అక్టోబర్ 31: జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్ నందు జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి)సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి.. మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు అయిన పారిశ్రామిక రంగాన్ని.. మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. పరిశ్రమల ప్రమోషన్ కు సంబందించి ఇంకా ఏవైనా అప్లికేషన్లు పెండింగ్ లో ఉంటే.. వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లా స్థాయి నుండి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపనపై అవగాహన పెంపొందించాలన్నారు.పారిశ్రామిక అభివృద్ధి పాలసీ (ఐ.డి.పి.) 2023-27-2024- 29 ద్వారా ఎస్సి, ఎస్టీ కేటగిరీకి సంబంధించి 24 ట్రాన్స్పోర్ట్ వాహనాల ఇన్వెస్ట్మెంట్ సబ్సిడీ కింద రూ 2.75 కోట్లు రాయితీ మంజూరుకు కమిటీ ఆమోదం తెలుపగా.. ట్రాన్స్పోర్ట్ వెహికలకు సంబంధించి తనిఖీ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.పరిశ్రమలకు వివిధ రాయితీల కింద రూ.67.62 లక్షల మేర రాయితీల మంజూరు ఆమోదం తెలిపారు.

### ఉద్యం రిజిస్ట్రేషన్ లపై 14 అవగాహన వర్క్ షాపులు

ప్రభుత్వం అనేక ప్రోత్సాహక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో వ్యాపార, పెట్టుబడి ధోరణిలో.. పారిశ్రామిక రంగం వైపు అవగాహన నిమిత్తం ఉద్యం" పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరుగుతోందన్నారు. వ్యాపారాన్ని ప్రారంభించే ప్రతి ఒక్కరు ఉద్యం పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని.. ప్రభుత్వం నుండి అందే అన్ని రకాల రాయితీలను పొందేలా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలో ఇప్పటివరకు ఉద్యం రిజిస్ట్రేషన్ లపై 14 వర్క్ షాపులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మేరకు పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ సంబందిత వివరాలను సమావేశంలో కలెక్టర్ కు వివరించగా.. ఆయా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం చాంద్ బాషా, ఏపీఐఐసీ జెడ్ ఎం శ్రీనివాసమూర్తి,లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్ధన, డిప్యూటీ చీఫ్



ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నా రావు, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, డిఆర్డిఏ పీడి రాజ్యలక్ష్మి ,పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు,డిటిఓ అధికారులు, వాణిజ్య పన్నుల శాఖ, ఏపీఎస్ పిడీసీఎల్ శాఖల అధికారులు,ఏపీఐఐసీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ అండ్ వెల్త్ సంస్థకు డబ్బులు చెల్లించిన బాధితులకు న్యాయం చేస్తాం

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




నంద్యాల, మహి న్యూస్, అక్టోబర్ 31:- దొర్నిపాడు మండలంలో "హెల్త్ అండ్ వెల్త్ ఫైనాన్స్ సొల్యూషన్" పేరుతో పనిచేసిన సంస్థ ఉద్యోగాల పేరుతో ప్రజలను మోసం చేసిన ఘటనపై బాధితులకు న్యాయం చేసేందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శుక్రవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్.ఎస్ హాల్ లో, హెల్త్ అండ్ వెల్త్ సంస్థకు డబ్బులు చెల్లించిన బాధితులతో కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, "హెల్త్ అండ్ వెల్త్" అనే సంస్థ "వర్క్ ఫ్రమ్ హోమ్" పేరుతో ఉద్యోగాలివ్వాలన్న నెపంతో సుమారు 850 మంది బాధితుల నుండి ఒక్కొక్కరి వద్ద 3.6 లక్షల రూపాయలు వసూలు చేసిందని తెలిపారు. ఒక్కొక్కరు నెలకు అరగంట పని చేస్తే రూ.40 వేల జీతం ఇస్తామని చెప్పి చాలామందిని నమ్మబలికారని చెప్పారు. దీంతో బాధితులు ఇంట్లోని బంగారం, ఇళ్లు, ఆస్తులను తాకట్టు పెట్టి ఆ సంస్థ నిర్వాహకులకు డబ్బులు చెల్లించినట్లు తెలిపారు. ఈనెల జీతాలు ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారని వివరించారు. బాధితులు ఇప్పటివరకు సంస్థ నుండి ఎటువంటి అగ్రిమెంట్ లేదా లిఖిత పూర్వక ఒప్పందం తీసుకోలేదని.... వారు అందించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకొని పోలీసులు డాక్యుమెంటేషన్, దర్యాప్తు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. బాధితులు జిల్లా యంత్రాంగానికి సహకరిస్తే త్వరితగతిన న్యాయం చేస్తామన్నారు. అలాగే, పోలీస్ శాఖ ఇప్పటికే హెల్త్ అండ్ వెల్త్ సంస్థ బ్యాంకు ఖాతాలు, ఆస్తుల వివరాలను స్వాధీనం చేసుకునే ప్రక్రియలో ఉందని, వీటి ద్వారా డబ్బు ప్రవాహంపై లోతైన విచారణ జరపనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పూర్తవ్వడానికి రెండు నుంచి మూడు నెలల సమయం పడుతుందని, ఆ తర్వాత కోర్టు ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేస్తామన్నారు. బాధితులు ఎటువంటి ధర్నాలు, గందరగోళాలు చేయకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలి" అని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ మాట్లాడుతూ, హెల్త్ అండ్ వెల్త్ సంస్థకు డబ్బులు చెల్లించి మోసపోయిన బాధితుల ఫిర్యాదుల ఆధారంగా ఈనెల 14వ తేదీన అధికారికంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు అయిన అనంతరం చట్టపరమైన అన్ని ప్రక్రియలు వేగంగా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. బాధితులు తమ వద్ద ఉన్న సంబంధిత వివరాలు, సాక్ష్యాలు, బ్యాంక్ రసీదులు వంటి సమాచారాన్ని పోలీసు శాఖకు అందిస్తే, విచారణ మరింత సులభతరం అవుతుందన్నారు. పోలీస్ శాఖ ఇప్పటికే సంస్థ నిర్వాహకుల బ్యాంకు ఖాతాలు, ఆస్తుల వివరాలను గుర్తించే ప్రక్రియలో ఉందని తెలిపారు. అవసరమైన ఆధారాలు సేకరించిన తర్వాత, ఆస్తులను సీజ్ చేసి కోర్టుకు అప్పగించడం, తద్వారా బాధితులకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం," అని ఎస్పీ స్పష్టం చేశారు. కేసు చట్టపరమైన దశల్లోకి వెళ్ళిన తర్వాత మొత్తం ప్రక్రియ పూర్తవ్వడానికి రెండు నుండి మూడు నెలల సమయం పట్టవచ్చని తెలిపారు. బాధితులు ఎటువంటి ఆందోళన గానీ, అశాంతి గానీ చెందకుండా పోలీస్ యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తే, తప్పకుండా త్వరితగతిన న్యాయం జరిగేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# మతలబుపేటలో రూ.కోటి 30 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం



సరుబుజ్జి, మహి న్యూస్, అక్టోబర్ 31: పల్లెల్ని సర్వాంగ సుందరంగా మార్చడమే కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని ఆమదాలవలస ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. సరుబుజ్జిలి మండలం మతలబుపేట గ్రామపంచాయతీలో రూ.కోటి 30 లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను ఆయన ప్రారంభించారు. మతలబుపేట గ్రామంలో ఈ నిర్మాణం పూర్తవడంతో ప్రజలకు ఎన్నో సంవత్సరాలుగా ఉన్న ఇబ్బందులు తొలగిపోయాయని, ప్రతి ఇంటికీ రవాణా సౌకర్యం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని రవికుమార్ సూచించారు. గ్రామ అభివృద్ధికి తీసుకున్న ఈ చర్యలపై మతలబుపేట ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివాల సూర్యం, జనసేన ఇంచార్జ్ పేడాద రామ్మోహన్, మండల అధ్యక్షులు అంబాల రాంబాబు, ఇతర కూటమి ముఖ్య నాయకులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

